

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

- తొలి రోజు నామినేషన్లు నిల్
- నేడు రఘువర్మ నామినేషన్
- 6న విజయగౌరి, 7న గాదె...

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నారు. 27న ... మిగతా 8వ పేజీలో

శరవేగంగా గ్రీన్ ఫీల్డ్ హైవే

చివరి దశలో విశాఖ- రాయ్‌పూర్ ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం

- ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి ఎక్స్‌ప్రెస్ హైవే
- 464 కిలోమీటర్లు, రూ.20 వేల కోట్లు
- ఏపీలో 100 కి.మీ.లు, ఒడిశాలో 240, ఛత్తీస్‌గఢ్‌లో 124 కి.మీ.లు
- సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం వద్ద అనకాపల్లి- ఆనందపురం రోడ్డుకు ఇంటర్ ఛేంజ్

సబ్బవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. మూడు రాష్ట్రాల మీదుగా ఆరు వరుసలతో నిర్మిస్తున్న ఈ రహదారికి సంబంధించి సబ్బవరం మండల పరిధిలో రోడ్డు నిర్మాణంతోపాటు సిగ్నల్ లైట్లు, నేమ్ బోర్డులు, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు తదితర పనులు పూర్తయ్యాయి. రహదారిపై ఎక్కడా మనుషులు, పశువులు దాటకుండే వుండడానికి గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిని కలుపుతూ సబ్బవరం సమీపంలో చిన్నయ్యపాలెం వద్ద సింగిల్ ట్రంపెట్ ఫ్లైఓవర్ నిర్మాణం మినహా మిగిలిన పనులు పూర్తయినట్టు ఎన్‌హెచ్‌ఏఐ అధికారి ఒకరు తెలిపారు.

భారతమాల ప్రాజెక్టు ఫేజ్-1 కింద ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లను కలుపుతూ ఆరు వరుసల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిపాదించింది. డీపీఆర్, భూసేకరణ, టెండర్ ప్రక్రియలు 2021లో పూర్తయ్యాయి. ఏడీబీ నిధులు సుమారు రూ.20 వేల కోట్లతో నిర్మించే ఈ రోడ్డు పనులను 18 ప్యాకేజీలుగా విభజించారు. ప్రస్తుతం వున్న జాతీయ రహదారితో (రాజాపులోవ- రాయ్‌పూర్) సంబంధం లేకుండా కొత్తగా దీనిని నిర్మిస్తున్నారు.

సబ్బవరం మండల పరిధిలో పూర్తయిన ఆరు లేన్ల విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే



ఎన్‌హెచ్-130 సీడీ నంబరు కేటాయించిన ఈ రహదారి మొత్తం పొడవు 464 కిలోమీటర్లు. ఏపీలో 100 కి.మీ.లు, నాలుగు ప్యాకేజీలు; ఒడిశాలో 240 కి.మీ.లు, 11 ప్యాకేజీలు; ఛత్తీస్‌గఢ్‌లో 124 కి.మీ.లు, మూడు ప్యాకేజీలుగా ఉంది. ఏపీలో సబ్బవరం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా అలూరు వరకు నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. ఆలూరు-జక్కువ 1వ ప్యాకేజీ, జక్కువ-కొర్లాం 2వ ప్యాకేజీ, కొర్లాం-కంటకాపల్లి 3వ ప్యాకేజీ, కంటకాపల్లి-సబ్బవరం 4వ ప్యాకేజీగా విభజించారు. సబ్బవరం నుంచి కొత్తవలస మండలం కంటకాపల్లి వరకు సుమారు 20 కి.మీ.ల రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. సబ్బవరం మండలంలో చిన్నయ్యపాలెం, మలునాయుడుపాలెం, గుల్లేపల్లి, ఎల్లుప్పి గ్రామాల పరిధిలో ఆరు కిలోమీటర్లు ఉంది. వాస్తవంగా 2024 చివరి నాటికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పూర్తికావాలి. అయితే కొన్నికారణాల వల్ల ఏడాది ఆలస్యంగా 2025 డిసెంబరునాటికి పూర్తి అవుతుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. సబ్బవరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో గులివిందాడ-చీపురువలస మధ్య టోల్ ప్లాజ్ నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే విశాఖపట్నం-రాయ్‌పూర్ మధ్య దూరం 130 కిలోమీటర్లు, ప్రయాణ సమయం ఆరు గంటలు తగ్గుతుంది.



కొత్తవలస, అరకు, రాయ్‌పూర్ దూరాలను తెలియజేసే బోర్డు

సాగరమాల పనులు త్వరలో ప్రారంభం

కాగా సబ్బవరం నుంచి షీలానగర్ వరకు సాగరమాల (పోర్టు కనెక్టివిటీ రోడ్డు) రోడ్డు నిర్మాణానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.950 కోట్లు కేటాయించింది. గతంలోనే భూ సేకరణ పూర్తికాగా, నిర్మాణ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయితే విశాఖ నగరంలో భారీ వాహనాల రద్దీ పూర్తిగా తగ్గిపోతుంది.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

అమృత్ భారత్ కింద రూ.27.3 కోట్లు మంజూరు

చురుగ్గా సాగుతున్న అభివృద్ధి పనులు

- అందుబాటులోకి రానున్న ఎస్కలేటర్, లిఫ్ట్, కాలిబాట వంతెన
- అధునాతన బాత్‌రూమ్స్, వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు
- రైల్వే క్వార్టర్స్ స్థలంలో వాణిజ్య భవన సముదాయం
- ఈ ఏడాది చివరినాటికి పూర్తవుతాయని అంచనా



రెండు, మూడు ప్లాట్‌ఫారాల మధ్య కాలిబాట వంతెన నిర్మాణం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను గతంలోనే ఎంపిక చేసింది. రూ.27.3 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు 2023 ఆగస్టు ఆరో తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. ప్రయాణికులకు పలు రకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.



నిర్మాణంలో వున్న మోడల్ వెయింటింగ్ హాల్ భవనం

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏ-1 గ్రేడ్‌లో వున్న అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఏళ్ల తరబడి అభివృద్ధికి, ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎస్కలేటర్, లిఫ్ట్ వంటి సదుపాయాలు లేకపోవడంతో ప్లాట్ ఫారాల మీదుకు వెళ్లడానికి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ప్లాట్ ఫారాలపై పూర్తిగా షెడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ఆయా బోగీల్లో ఎక్కే/ దిగే ప్రయాణికులు తడిసిపోతున్నారు. ఈ సమస్యలను నివారించడానికి, మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయడానికి కేంద్రం ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద నిధులు కేటాయించింది. రెండు, మూడు ప్లాట్‌ఫారాలపై మార్బుల్స్ వేస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు తూర్పు భాగంలో కాలినడక వంతెన, ఎస్కలేటర్, లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నారు. రెండు, మూడు ప్లాట్‌ఫారాల మధ్య ఆధునిక బాత్‌రూమ్స్, వెయింటింగ్ హాల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడే 'వన్ నేషన్- వన్ ప్రోడక్టు' కింద ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్, ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఒకటో నంబరు ప్లాట్‌ఫారానికి సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్ స్థానంలో వాణిజ్య భవన సముదాయాన్ని నిర్మిస్తారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో ఆరు ట్రాక్‌లు ఉన్నాయి. మూడో ప్లాట్‌ఫారం వైపు మరో ట్రాక్ అందుబాటులో వస్తుంది. రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులకు 2023 ఆగస్టులో ... మిగతా 8వ పేజీలో



కృష్ణాదేవిపేట సంతలో టమాటాలను అమ్మకానికి తెచ్చిన రైతులు

టమాటా ధర నేల చూపులు

- కృష్ణాదేవిపేట సంతలో కిలో రూ.5
- ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన
- విలువ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వినతి

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టమాటా ధరలు రోజు రోజుకీ తగ్గిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సోమవారం ఇక్కడ సంత/ మార్కెట్‌లో క్రేట్ (సుమారు 30 కిలోలు) టమాటాలు రూ.140 నుంచి రూ.150 మాత్రమే పలికాయి. అంటే కిలోకు రూ.5 మాత్రమే రైతుకు దక్కింది. కొయ్యూరు, గొలుగొండ మండలాల్లోని ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, పాడి, కొండగోకిరి, రత్నంపేట, భీమవరం, పి.మాకవరం, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం తదితర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున టమాటాలు తీసుకురావడంతో వ్యాపారులు ఒక్కసారిగా ధర తగ్గించేశారు. ఇదే క్రేట్ టమాటాలు గత వారం రూ.300 పలికాయి. వారం తిరిగే సరికి రేటు సగానికి పడిపోయింది. ఈ ధరకు అమ్ముకుంటే నష్టమే తప్ప పెట్టుబడి కూడా రాదని రైతులు వాపోతున్నారు. పంట సాగుకు పెట్టుబడితోపాటు టమాటా ఏరడానికి కూలీలకు, మార్కెట్ తీసుకురావడానికి రవాణా చార్జీలు, మార్కెట్‌లో ఆశీలు కలుపుకుంటే తమకు మిగిలేది ఏమీలేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో టమాటా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయించి, టమాటాలకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా దుగ్గాడ ప్రాజెక్టు

- తుప్పుపట్టిన మదుముల గేట్లు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం
- పాడైపోయిన సిమెంట్ లైనింగ్
- ఆయకట్టు చివరి భూములకు అందని నీరు
- గత ప్రభుత్వంలో ప్రతిపాదనలకే పరిమితమైన మరమ్మతు పనులు



వేములపూడి వద్ద తుప్పు పట్టి పాడైపోయిన మదుం గేట్లు. (ఇన్‌సెట్‌లో) పూడిక పేరుకుపోయిన దుగ్గాడ కాలువ

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించే దుగ్గాడ ప్రాజెక్టు నిర్వహణ అధ్వానంగా వుండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మదుములు, గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పంట కాలువల్లో పూడి, చెత్తాచెదారం పేరుకుపోయాయి. ఆయకట్టు చివరి భూములకు నీరు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కాలువలకు సిమెంటు లైనింగ్, మదుముల మరమ్మతులకు అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడం, పాలకులు బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది.

నర్సీపట్నం మండలంలో వరహా నదిపై దుగ్గాడ వద్ద గతంలో ఆనకట్ట నిర్మించారు. ఇక్కడి నుంచి వేములపూడి మీదుగా కోటవురట్ల మండలం తంగేడు వరకు పంటకాలువ వుంది. దీని ద్వారా 1,900 ఎకరాలకు నీరు అందుతుంది. కాలువపై వివిధచోట్ల 12 మదుములు ఉండగా వాటిలో నాలుగు శిథిలావస్థకు చేరాయి. ఆనకట్ట దగ్గర పెద్ద గేట్లతోపాటు మదుముల గేట్లు తుప్పు పట్టాయి. కాలువ లైనింగ్ పూర్తిగా పాడైపోయింది. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో కాలువలో పూడిక పేరుకుపోయింది. దీంతో నీరు సరిగా ప్రవహించక ఆయకట్టు చివరి భూములకు నీరు సరిగా అందడం లేదు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గణేశ్ కాలువ లైనింగ్ పనులకు ఇరిగేషన్ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. దుగ్గాడ నుంచి బాపిరాజు కొత్తపల్లి వరకు ఆరు కిలో మీటర్ల మేర కాలువలో సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టడానికి రూ.4 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనాలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపారు. కానీ అక్కడ నుంచి ఎటువంటి స్పందన లేదు. ఈ నేపథ్యంలో గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. ఇరిగేషన్ ఏఈ రమణపాత్రుడు రెండు వారాల క్రితం దుగ్గాడ కాలువను పరిశీలించారు. గట్టు వద్ద ఆరు పెద్ద గేట్లు, 18 మదుం గేట్లు మరమ్మతు చేయించడానికి రూ.30 లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. త్వరలో నిధులు మంజూరవుతాయని రైతులు ఆశాభావంతో వున్నారు.

మూనాళ్ల ముచ్చట



ప్యాచ్ వర్కులు చేసిన ఎలమంచిలి బైపాస్ రోడ్డు. (ఇన్‌సెట్‌లో) శ్రీరామ చంద్రమ్మ అమ్మవారి ఆలయం వద్ద లేచిపోయిన రాళ్లు

- రహదారులపై ప్యాచ్ వర్కుల్లో నాణ్యతా లోపం
- గోతులు కప్పిన నాలుగు రోజులకే లేచిపోతున్న రాళ్లు
- కానరాని ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ

ఎలమంచిలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రహదారులపై గోతుల పూడ్చివేత పనుల్లో కొన్నిచోట్ల నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. గోతులు కప్పిన మూడు రోజులకే రాళ్లు లేచిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారుల మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలమంచిలి పట్టణంలోని బైపాస్ రోడ్డులో విజయలక్ష్మి పెట్రోలు బంకు నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్డుపై నాలుగు రోజుల క్రితం ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం మేర గోతులు పూడ్చివేతకు లక్షన్నర రూపాయలు ఖర్చు చేశారు. నాలుగు రోజులు గడవక ముందే తారుతో సహా రాళ్లు లేచిపోయాయి. గోతుల కన్నా ఈ రాళ్లే ప్రమాదకరంగా మారాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి ప్యాచ్ వర్క్ పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హైవేపై నిఘా నేత్రాలు

- పాయకరావుపేట నియోజకవర్గంలో పలు జంక్షన్లలో సీసీ కెమెరాలు
- హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు పోలీసులు ఏర్పాట్లు



సీసీ కెమెరాను ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ కుమారస్వామి

నక్కపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో జాతీయ రహదారిపై పలు జంక్షన్లలో పోలీసు అధికారులు అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరం నుంచి పాయకరావుపేట వరకు పలు ప్రధాన జంక్షన్లు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో (బ్లాక్ స్పాట్‌లు) దాదాపు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు జి.అప్పన్న, కె.కుమారస్వామి, ఎల్.రామకృష్ణ పర్యవేక్షణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రాంతాలను గుర్తించారు. స్థానిక సీఐ కుమారస్వామి సోమవారం సాంకేతిక సిబ్బందితో కలిసి నక్కపల్లిలో పలు ప్రదేశాలను పరిశీలించారు. సీసీ కెమెరాలు ఎక్కడెక్కడా ఏర్పాటు చేయాలో సిబ్బందికి సూచించారు. ప్రమాదాల నివారణకు, నేరాలకు పాల్పడి పారిపోయే నిందితులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన





జంగులూరులో తెలుగుదేశం, వైసీపీ నేతల ఫ్లెక్సీలు

- గ్రామాల్లో యథావిధిగా రాజకీయ నేతల ఫ్లెక్సీలు
- ముసుగులు కప్పని విగ్రహాలు
- కోడ్ అమల్లోకి వచ్చి ఐదు రోజులైనా తొలగించని సిబ్బంది

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్నికల కోడ్ సరిగా అమలు కావడంలేదు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఐదు రోజులు దాటినప్పటికీ గ్రామాల్లో రాజకీయ ... మిగతా 8వ పేజీలో

ఇంటర్వ్యూ..

సకాలంలో సమస్యలు పరిష్కారం

నరసింహమూర్తి, తహసీల్దార్, నక్కపల్లి



హోం మంత్రి అనిత నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వచ్చిన సమస్యలను శత శాతం పరిష్కరించినట్టు నక్కపల్లి తహసీల్దార్ నర్సింహమూర్తి చెప్పారు. రెవెన్యూ సదస్సులను విజయవంతంగా ముగిశాయన్నారు.

(ఆంధ్రజ్యోతి/నక్కపల్లి)

ప్రశ్న:రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని ఫిర్యాదులొచ్చాయి?

జవాబు: మండలంలోని అన్ని గ్రామాలనుంచి 671 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో తమ పరిధిలోని 97 ఫిర్యాదులను పరిష్కరించాం.

ప్రశ్న: రీసర్వే ప్రక్రియ ఎలా సాగింది ?

జవాబు: మండలంలో 16 గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాం. ప్రజల నుంచి 380 దరఖాస్తులు వచ్చాయి. దాదాపుగా 90శాతం దరఖాస్తులను పరిష్కరించాం. రీ సర్వే పైలట్ ప్రాజెక్టుగా గుల్లిపాడు ఎంపిక చేశారు. ఈ గ్రామంలో 120 రోజులపాటు సమగ్ర రీ -సర్వే చేపట్టి రైతులకు భూములు అప్పగిస్తాం.

ప్రశ్న: హోం మంత్రి ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారమయ్యాయా ?

జవాబు: గత నెలలో హోం మంత్రి నక్కపల్లిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 144 ఫిర్యాదులు పరిష్కరించాం.

ప్రశ్న:వీఆర్వో పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయి?

జవాబు: మండలంలో 24 రెవెన్యూ క్లస్టర్లలో 20మంది వీఆర్వోలున్నారు. మిగిలిన నాలుగింటిలో ఇన్‌ఛార్జిలను నియమించాం.

ప్రశ్న: విద్యార్థుల సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరుగుతుందా ?

జవాబు: విద్యార్థుల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఎటువంటి ఆలస్యం జరగడం లేదు. అన్ని ఆధారాలతో దరఖాస్తు చేస్తే, పరిశీలన అనంతరం వెంటనే సర్టిఫికెట్లను అందజేస్తున్నాం.

ధర్మశ్రీని కలిసిన వైసీపీ నేతలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని వైసీపీ మండల నాయకులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, నాయకులు లాలం రాంబాబు, కోన లచ్చం నాయుడు, పిన్నమరాజు వాసు, పీలా సతీష్, భీముని వేంకటేశ్వరరావు తదితరులు ధర్మశ్రీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రామాలయంలో సరస్వతిదేవికి పూజలు

మునగపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెదరామాలయం ఆవరణలో సరస్వతిదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్ద పెతకంశెట్టి రామజోగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, కొణతాల శివరామకృష్ణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గ్రామాలలో స్వమిత్వ సర్వే ప్రారంభం

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో సోమవారం స్వమిత్వ సర్వే ప్రారంభించినట్టు పంచాయతీ కార్యదర్శి వైవీ సత్యనారాయణ తెలిపారు. ఈ సర్వేలో గ్రామాలలోని ఇళ్ల కొలతలు వేసి హక్కుల పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది సామాజిక, ఆర్థిక సాధికారత, స్వీయ సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. స్వమిత్వ సర్వేలో కచ్చితమైన భూ రికార్డులను అందించడం ద్వారా ఆస్తి వివాదాలను తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి రికార్డుల స్పష్టత, ప్రామాణికతను తీసుకురావడం స్వమిత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై ఫిర్యాదు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పూడిమడక రక్షిత తుఫాన్ భవనం వద్ద రోడ్డు పక్కన అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ముందు నుంచి పెద్ద కాలువ ఉంది. ఈ కాలువను కప్పేసి నిర్మాణం చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకి తుఫాన్ రక్షిత భవనానికి మధ్య చేస్తున్న ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామస్థులు ఉమ్మిడి సత్తిబాబు, గంగరాజు, వాసుపల్లి రాజేష్ ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల

పాయకరావుపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్‌ని స్థానిక మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శనగా పెట్టారు. అనంతరం ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు మాట్లాడుతూ మండలంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి మంచి రోజులు : కొణతాల

కోటవురట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం తంగేడు రాజుల కుటుంబంలో శుభ కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర విభజనలో కోల్పోయిన వాటిని తిరిగి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీసుకువస్తున్నారన్నారు. పరిపాలన అనుభవం ఉన్న ముఖ్యమంత్రి అధికారంలో ఉంటే ఎటువంటి మేలు జరుగుతాయనేది ఈ ఏడు నెలల పాలనలో రుజువు అయిందన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతిలకు నిధులు కేటాయింపులు, స్టీల్ ప్లాంట్‌కు మళ్లీ పూర్వవైభవం వచ్చే విధంగా కేంద్రప్రభుత్వం రూ.11,440 కోట్లు ప్యాకేజీ అందించిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఈఏడాది బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు. రాష్ట్రంలో అనకాపల్లి గ్రోత్ ఇంజన్‌గా మారిందన్నారు. జిల్లాలో మంచి పరిశ్రమలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపనలు చేశారన్నారు. వీటి వలన నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో గత పదేళ్లకంటే ఈ ఏడాదిలో రాష్ట్రానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వ డం జరిగిందన్నారు. ఐటీ ట్యాక్సు పరిమితి రూ.12 లక్షలకు పెంచడం మధ్యతరగతి వారికి ఎంతో మేలు అని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్, చికెట్ల భాస్కరరావు పాల్గొన్నారు.



తంగేడులో విలేకర్లతో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

» దళిత నాయకుల డిమాండ్

పాయకరావుపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పోలీసులు పట్టుకుని కఠినంగా శిక్షించాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ఈ విషయాన్ని గుర్తించిన సాంఘిక సంక్షేమ శాఖ సహాయాధికారిణి జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న దళిత నాయకులు ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, పల్లా విలియంకేరి, నెలపర్తి అర్జున్ తదితరులు మాట్లాడుతూ పార్కులో 2014లో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం అత్యంత దారుణమన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, కువల కుమార్, బోడపాటి శ్రీను, పల్లా ప్రసాద్, తాటిపాక లోవరాజు పాల్గొన్నారు. కాగా సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ జి.అప్పన్న వివరాలు సేకరించారు. అదేవిధంగా డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, దోషులను త్వరలో పట్టుకుంటామన్నారు.



ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

సంఘటన స్థలాన్ని పరిశీలించిన టీడీపీ నేతలు

పార్కులో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం స్థానిక టీడీపీ నాయకులు పరిశీలించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి వచ్చిన నాయకులు సీఐ జి.అప్పన్న నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటివి జరక్కుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు పల్లా విలియంకేరి, చింతకాయల రాంబాబు, పెదిరెడ్డి నాగవెంకటరమణ, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, కుంచె ప్రసాద్ తదితరులున్నారు.

అధిస్తాన్ ఉద్యోగులు విధులకు హాజరు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని అధిస్తాన్(బ్రాండిక్స్) వస్త్ర తయారీ కర్మాగారంలో సోమవారం నుంచి ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. అదనంగా అరగంట పనివేళలు పెంచడం, ఇతర ప్రోత్సాహకాలను నిలిపివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడంతో వేలాది మంది ఉద్యోగులు ఉద్యమించారు. కర్మాగారం భారత భాగస్వామి దొరస్వామితోపాటు కార్మిక శాఖ అధికారిణి రమ్య ఉద్యోగులకు నచ్చజెప్పి హామీలు ఇవ్వడంతో శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత ఉద్యోగులు ఆందోళన విరమించి ఇళ్లకు వెళ్లిపోయారు. అలాగే ఆదివారం సెలవు కావడంతో సోమవారం యథావిధిగా విధులకు హాజరుకావాలని కర్మాగారం ప్రతినిధులు కోరారు. కానీ సోమవారం కూడా ఆందోళన కొనసాగించే అవకాశం ఉందన్న సమాచారం అందుకున్న కర్మాగారం ప్రతినిధులు పోలీస్ పహారా ఏర్పాటుచేశారు. అయితే సోమవారం ఉదయం మొదటి షిఫ్టుకి బీ1, బీ2, బీ3 యూనిట్లకు నాలుగు వేల మంది విధులకు హాజరయ్యారు.

నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తా : దొరస్వామి

నెల రోజుల్లో అధిస్తాన్ ఉద్యోగుల సమస్యలు సామరస్యంగా పరిష్కరిస్తానని కర్మాగారం భారత భాగస్వామి దొరస్వామి హామీ ఇచ్చారు. సోమవారం విధులకు హాజరైన మహిళా ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. అరగంట అదనంగా పనిచేయమని ప్రతినిధులు నిబంధన విధించిన విషయం తనకు తెలియదని, అందువల్లే తాను ఆ నిబంధనను వెంటనే రద్దు చేశానని ప్రకటించారు. మిగతా సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే ఇలా రోడ్లపై ఆందోళనలు చేసేవారు కాదన్నారు. దొరస్వామి హామీతో మహిళా ఉద్యోగులు ఆనందంగా విధులు నిర్వహించారు.



మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న దొరస్వామి

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

» తల్లిదండ్రులకు డిప్యూటీ డీఈవో అప్పారావు సూచన

ఎస్.రాయవరం,ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలోని పెనుగొల్లులో సోమవారం రాత్రి ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థుల గ్రూప్ స్టడీ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టెన్త్ విద్యార్థులందరూ రాత్రి సమయంలో గ్రూపుగా ఏర్పడి చదువుకోవాలని సూచించారు. అలా కలిసి చదువుకోవడం వలన వెనుకబడిన విద్యార్థులు కూడా చదువులో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

టెన్త్ ప్రణాళికలపై డిప్యూటీ డీఈవో ఆరా

నక్కపల్లి: మండలంలోని డీఎల్‌పురం, వేంపాడు జడ్పీ హైస్కూళ్లను సోమవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు తనిఖీ చేశారు. ఈ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు సంబంధించి 100 రోజుల ప్రణాళిక అమలుపై ఆయన ఉపాధ్యాయులతో చర్చించారు. టెన్త్ బాలబాలికల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. వత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. టెన్త్‌లో కొన్ని సబ్జక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మూర్తిరాజు, ఎంఈవో కె.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీకేపల్లిలో వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటి నుంచి పిండి వంటల తీసుకొని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరీపరమేశ్వరులకు సారె సమర్పించారు. ఈ మూడు రోజుల పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించినట్టు సర్పంచ్ పెట్ల లింగం నాయుడు తెలిపారు.



సారెను తీసుకువెళ్తున్న భక్తులు

ఎంఈవో-2గా స్వప్నప్రియ రెడ్డి బాధ్యతల స్వీకారం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగరాజుపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వప్నప్రియ మండల ఇన్‌చార్జి ఎంఈవో-2గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి, స్థానిక ఎంఈవో-1 పి. అప్పారావు సమక్షంలో ఇన్‌చార్జి ఎంఈవో-2గా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, మండల యూనిట్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



స్వప్నప్రియరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న టీచర్లు

ఆలయ పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల జంక్షన్-ఎర్రవరం రోడ్డులో నాగేంద్రస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో మరుగుదొడ్ల వ్యర్థాలు వేసేస్తున్నారు. దీంతో ఈమార్గం గుండా వెళ్లే వారంతా దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. సెప్టిక్‌క్లీన్ చేసే వారు తమ వాహనాల్లో వ్యర్థాలను ఆలయం ఎదురుగా ఉన్న కొండగెడ్డ కాలువలో వేసేస్తున్నారు. వాహనాన్ని తుప్పల్లో పెట్టి వ్యర్థాలను కాలువల్లో వేసి వెళ్లిపోతున్నారు. వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఈప్రాంతీయులు కోరుతున్నారు.

గూడుపమ్మతల్లి ఆలయ కరపత్రాల ఆవిష్కరణ

నక్కపల్లి,ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామంలో కొత్తగా నిర్మించిన గూడుపమ్మతల్లి ఆలయం ప్రారంభోత్సవ కరపత్రాలను సోమవారం రాత్రి రేబాకలో ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, గ్రామ పెద్దలు అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కరపత్రాలు గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరాజు మాట్లాడుతూ శక్తి పీఠంగా గూడుపమ్మతల్లి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించామని చెప్పారు. 7వ తేదీన ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు.

అధిస్తాన్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధిస్తాన్ ఉద్యోగులకు వేతనాలు పెంచడంతోపాటు నిర్బంధాలను ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం అచ్యుతాపురం జంక్షన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉద్యోగులకు అన్ని కటింగ్‌లు పోనూ రూ.15వేలు వేతనం ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు అండగా నిలిచిన సీఐటీయూ నాయకులను నిర్బంధించి పోలీసులు భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదే పద్ధతి కొనసాగితే భారీ స్థాయిలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కె.సోమునాయుడు, శివాజీ, రామకృష్ణ, ఆర్.లక్ష్మి, వెంకయ్య నాయుడు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గొల్లలకొండపై రథసప్తమి వేడుకలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి గొల్లల కొండపై వెలసిన సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా రథసప్తమి పర్వదినంనాడు కొండపై ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఇప్పటికే స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెల్లవారు నుంచి స్వామివారికి వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. కొండపైన, దిగువన భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలి : ఎంపీడీవో

నక్కపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. సోమవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. వలంటీర్లు, వెలుగు సిబ్బందికి ఉల్లాస్ గురించి వివరించారు. అక్షర వెలుగు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ నెల4వ తేదీ నుంచి గ్రామాల్లో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఏపీవో శ్రీనివాస్ చెప్పారు. పంచాయతీకి 10 నుంచి 20 మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసి, ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రాలు లేదా కమ్యూనిటీ భవనాల్లో శిక్షణ ఇవ్వాలని ఎంఈవో నరేశ్ సూచించారు.

ఘనంగా పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి స్వామి అమ్మవార్లకు విశేష పూజలనంతరం సాయంత్రం 4 గంటలకు పంచరాత్ర ఆగమశాస్త్రానుసారం ఉత్సవ ఆయుష్య, విశ్వక్సేణ ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ముచ్చంగ్రహణ అంకురార్పణ, వైనతేయ పట్టాభివాసం తదితర క్రతువులను నిర్వహించారు. ఆలయ ఈవో కె.దివ్యతేజతోపాటు పలువురు భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. మంగళవారం జరగనున్న స్వామివారి దివ్యకల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశామని, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని ఆలయ ఈఓ కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు యి.నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబు పాల్గొన్నారు.



పాండురంగస్వామి, అమ్మవార్లు

భూమి కాలువ గట్టు ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావనం శివారులో భూమి పంట కాలువ గట్టుపై షెడ్డు నిర్మాణాన్ని సోమవారం ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. భూమి పంట కాలువను ఆనుకుని ఉన్న ఒక ఇంటి యజమాని గట్టును ఆక్రమించి షెడ్డు వేసేందుకు సిమెంట్ స్తంభాలు వేయడంపై ఫిర్యాదు అందిందన్నారు. తమ సిబ్బంది వెళ్లి పనులు నిలిపివేయించారన్నారు. మంగళవారం స్వయంగా పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



కాలువ గట్టుపై సిమెంట్ స్తంభాలు ఏర్పాటుచేసిన దృశ్యం

అయ్యన్నకు వడ్డించిన కొణతాల



షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ సాగిరామభద్రరాజు మనవడి ఉపనయన మహోత్సవానికి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కూర వడ్డించారు. ఈ దృశ్యాన్ని వచ్చిన అతిథులు ఆసక్తిగా తిలకించారు.

\- ఆంధ్రజ్యోతి, కోటవురట్ల

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతు వనరుల కేంద్రం ఏడీఏ సుబ్రహ్మణ్యం సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో ఆయన అపరాల పంటలను పరిశీలించారు. పంటలలో ఉండే చీడపీడలను గుర్తించి, నివారణకు సలహాలు, సూచనలు అందించేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన రైతులు ఈ యాప్ డౌన్లోడ్ చేసుకుని పొలాల్లో ఉన్న చీడపీడలను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వెంటనే ఆ తెగుళ్లను గుర్తించడంతోపాటు సస్యరక్షణ సూచనలు రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె. ఉమాప్రసాద్, ఏవో పి.ఆదినారాయణ, రైతు వనరుల కేంద్రం ఏవో తులసి, ఏఈవో జ్యోత్స్న, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



మునపర్తిలో వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునపర్తి హరిహర పంచాయతన క్షేత్రం (సిద్ధాశ్రమం) కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుతున్నారు. సోమవారం ఉదయం విశ్వక్షేణ పూజ, అష్టోత్తర కలశ మహాస్థాపన అనంతర కల్యాణం వైభవంగా జరిపారు. వేదపండితులు గండికోట వెంకట బ్రహ్మ శ్రీనివాస శర్మ, ఆలయ కన్వీనర్ తెడ్లపు సత్యనారాయణ, గెడ్డం కాసులమ్మ, వెన్నెల అప్పల నాయుడు, లక్ష్మీకుమార్, భూపతిరాజు నరసింహరాజు, కేవీ కృష్ణ మూర్తి, ములుకూరి రమణ, శరభయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు అందుబాటులో కృత్రిమ గర్భదారణ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు కృత్రిమ గర్భదారణ అందుబాటులో ఉంచామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు తెలిపారు. సోమవారం హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో తమ్మయ్యపేటలో జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 50 రూపాయలకే పశువులకు కృత్రిమ గర్భదారణ చేస్తున్నామన్నారు కార్యక్రమంలో వైద్యాధికారి హేమ సుందర్, సీహెచ్ రాము, బి. అప్పారావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాలినడకన శ్రీశైలానికి శివస్వాములు



సత్యవరం నుంచి శ్రీశైలం కాలినడకన బయలుదేరిన శివస్వాములు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం నుంచి శ్రీశైలం క్షేత్రానికి సోమవారం శివస్వాములు కాలినడకన బయలుదేరారు. సత్యవరానికి చెందిన గోళ్ల శివ, బోయిడి తాతయ్యలు, నారపురెడ్డి జోగిరాజు, కర్రి దత్త, తదితరులు శివ మాల ధరించారు. వీరు సత్యవరం నుంచి కాలినడకన శ్రీశైలానికి బయలుదేరారు. మహాశివరాత్రికి ముందుగా శ్రీశైలం చేరుకుని మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి దీక్ష తీసుకున్నట్టు శివ స్వాములు తెలిపారు. శివ స్వాములను సోమవారం గ్రామ పెద్దలు, మహిళలు భజనలతో సాగనంపారు.

టెన్త్ విద్యార్థులతో విద్యా దీక్ష

ఎలమంచిలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులంతా కలిసి విద్యాదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం శాస్త్రి, ఉపాధ్యాయులు బొడ్డేటి సత్యనారాయణ పర్యవేక్షణలో మంచి మార్కులు సాధిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతోపాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేఆర్. అప్పలనాయుడు, నాగరాజు, సుబ్బారావు, సుధాకర్, షబ్బీరు, చిటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

మునగపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజోతి): తమకు వంద రోజులు పని కల్పించాలని ఉపాధి హామీ లబ్ధిదారులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా అంబేద్కరిజం పునాది వ్యవస్థాపకుడు రాజాన బుజ్జిబాబు మాట్లాడుతూ పని ప్రాంతంలో వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఆందోళనలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా వసంత పంచమి

పాయకరావుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వసంత పంచమి పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో జ్ఞాన ప్రదాత సరస్వతిదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతిదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలువు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వసంత పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు.

6 నుంచి ఏఐవైఎఫ్ మహాసభలు

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఈ నెల 6వ తేదీ నుంచి 22వ అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్టు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాజు తెలిపారు. సోమవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతో పాటు స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ అధీనంలో కొనసాగించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు చోడవరం విద్యార్థులు

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహతి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం అనకాపల్లిలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్ అబాకస్ పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని డి.అశ్రిత, ఆరో తరగతి విద్యార్థులు కె.సురేశ్, యు.గౌరేంద్రీ విశేష ప్రతిభ కనపరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కేశవస్వామి కల్యాణోత్సవాలు

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి కేశవస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. ఉత్సవాలలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

రోలుగుంట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాలలో యూటీఎఫ్ ప్రచురించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.సతీశ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌కుమార్, మండల కోశాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎడ్ల పరుగు పోటీలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తిమిరాం గ్రామంలో రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణమూర్తి తీర్థ మహోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు వారు చెప్పారు.

రామాలయం నిర్మాణానికి రూ.లక్ష వితరణ

కృష్ణాదేవిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీహెచ్.నాగాపురం గ్రామంలో రామాలయం నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుంపలపూడి సంపత్‌చంద్ర రూ.లక్ష విరాళం అందించారు. విశాఖపట్నంలోని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన సహోద్యోగులు, స్నేహితుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నేత బొప్పన ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంపత్‌చంద్ర మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ తమకు తోచిన సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సూరజ్‌రెడ్డి, పవన్‌సాగర్, చుప్పాల రోహిత్, పవన్‌వర్మ, చిట్టిరాజు, ద్వారక్‌నాథ్, రాజాకౌశిక్, మనోజ్, అలేఖ్యరెడ్డి, టీడీపీ నాయకులు ఎస్.వరహాల బాబు, ఎ.దివాణం, నాగేశ్వరరావు, సత్తిబాబు, రామారావు, సూరిబాబు పాల్గొన్నారు.

ఎం.కోటపాడులో చోరీ

ఐదున్నర తులాల బంగారం, వంద తులాల వెండి అపహరణ

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఓ ఇంటిలోకి దొంగలు చొరబడి ఐదున్నర తులాల బంగారం, వంద తులాల వెండి వస్తువులు అపహరించారు. ఎస్‌ఐ నారాయణరావు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి ముత్యాలనాయుడు భార్యతో కలిసి ఆదివారం ఉదయం చోడవరంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉండిపోయి సోమవారం ఉదయం తిరిగి కోటపాడు వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. అందులో దాచిన ఐదున్నర తులాల బంగారం, వంద తులాల వెండి వస్తువులు, రూ.2.5 లక్షల నగదు కనబడలేదు. దీంతో చోరీ జరిగినట్టు గుర్తించి మాడుగుల పోలీసులకు బాధితుడు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా కలసి పనిచేద్దాం'

దేవరాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా దళితులంతా కలసి పనిచేద్దామని దళిత సంఘాల మండల ఐక్య వేదిక ప్రతినిధులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. సన్యాసమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం మండల నేత కాటపల్లి అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాలను అణచివేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. వివిధ శాఖలుగా ఉన్న దళిత సంఘాలన్నీ కలసి అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం

అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాటపల్లి అప్పారావు, గౌరవాధ్యక్షుడిగా కార్లి సాయిసుందరరావు, ఉపాధ్యక్షుడిగా దువ్వాడ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పి.నాగభూషణంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కారు చీకటి నుంచి వెలుగులోకి..

నీలబంద గ్రామానికి విద్యుత్ సదుపాయం

ఆరు కిలోమీటర్లు స్తంభాలు మోసిన సిబ్బంది

అతి కష్టంగా కనెక్షన్లు ఏర్పాటుచేసిన విద్యుత్ శాఖ

గిరిజనుల హర్షం.. నృత్యాలతో సంబరం


కొండ మీదకు విద్యుత్ స్తంభాలు మోసుకువెళ్తున్న సిబ్బంది

రోలుగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా మగ్గిపోతున్న అంధకారం తొలగిపోయింది. కారు చీకటి నుంచి విముక్తి లభించింది. ఎన్నడూ చూడని వెలుగులు ఒక్కసారిగా విరజిమ్మడంతో ఆనందం నిండిపోయింది. ఈ దృశ్యం మారుమూల ఆదివాసీ గ్రామం నీలబందలో కనిపించింది.

ప్రతీ మారుమూల గ్రామానికి రోడ్డు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలతో రోలుగుంట


కొత్త కనెక్షన్‌తో ఆదివాసీ ఇంటి వద్ద వెలుగుతున్న విద్యుత్ దీపం


తొలిసారి విద్యుత్ వెలుగులు రావడంతో గిరిజనుల నృత్యాలు

మండలం అర్ల పంచాయతీ శివారు నీలబంద గ్రామానికి విద్యుత్ శాఖ అధికారులు తొలిసారిగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. పితృగెడ్డ గ్రామం నుంచి దశాబ్దా కాలం క్రితం వలసవెళ్లి నివాసం ఏర్పాటు చేసుకున్న నీలబంద గ్రామానికి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం క్లిష్టతరమైనప్పటికీ, రోడ్డు సౌకర్యం లేని ఈ గ్రామానికి విద్యుత్ సిబ్బంది ఆరు కిలోమీటర్ల మేర విద్యుత్ స్తంభాలను మోసుకువెళ్లి మరీ విద్యుత్ సౌకర్యం కల్పించారు. అంతకాకుండా గ్రామంలో నివసిస్తున్న అన్ని కుటుంబాల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లను అందించారు. ఆదివారం రాత్రి గ్రామంలో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా కారు చీకటిలో మగ్గిపోతున్న గిరిజనులు ఆనందంలో మునిగితేలారు. అందరూ కలిసి నృత్యాలతో సంబరాలు చేసుకున్నారు.


విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దృశ్యం.. (ఇన్‌సెట్‌లో) ఓ ఇంటికి మీటరు బిగిస్తున్న సిబ్బంది

ఈ సందర్భంగా అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ గొప్పు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ మారుమూల గ్రామానికి విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. పీటీజీల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లను అందిస్తున్నామని చెప్పారు. ఇటీవలే రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలోని సొంపురంబంద అవాసాలకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించామని ఆయన వివరించారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. రమణాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 250 మంది చిన్నారులతో తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, వాసు పాల్గొన్నారు.

అలాగే స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. అర్చకులు కొడమంచిలిచలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులతో తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు.



చోడవరం ఉషోదయ కళాశాల ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు... కె.కోటపాడులో అక్షరాభ్యాసాలు

కె.కోటపాడులో...

కె.కోటపాడు: చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజు వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం అయ్యన్న విద్యా సంస్థలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. సరస్వతీదేవి ప్రత్యేక పూజలో అర్చకులు గోరుగొంతు రమేశ్‌బాబు మంత్రోచ్చరణ, చిన్నారుల నోట సరస్వతి శ్లోకాలతో పాఠశాల ప్రాంగణం ప్రతిధ్వనించింది. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, నూర్జహాన్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమం అనంతరం సుమారు 40 మంది చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా బాలికలు నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్యాసంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కొత్తకోటలో వసంత పంచమి వేడుకలు


ఆర్క్‌బర్డ్ పాఠశాలలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు, విద్యార్థులు

రావికమతం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుల తల్లి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు విద్యాలయాల్లో సరస్వతీదేవి అనుగ్రహం కలగాలని 800 మంది విద్యార్థులతో వేద పండితులు హోమం నిర్వహించారు. మహా గణపతి, సరస్వతీదేవికి పూజలు చేశారు.

జీడి తోటల వేలంతో రూ.32.43 లక్షల ఆదాయం


నర్సీపట్నం కలప డిపో వద్ద బందోబస్తులో ఉన్న పోలీసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కలప డిపోలో అటవీ శాఖ జీడి తోటల వేలం పాటను పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. 19 జీడి తోటలు వేలం పాట నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇవ్వగా సోమవారం ఐదింటికి మాత్రమే జరిగిందని అటవీ అధికారులు చెప్పారు. వేలం పాట ద్వారా రూ.32.43 లక్షలు ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు. నర్సీపట్నం అటవీ రేంజ్ పరిధిలోని పెమిడికొండలోని 89 హెక్టార్లలో 5,238 జీడి చెట్లు రూ.25 లక్షలకు పాడుకున్నారు. అనకాపల్లి అటవీ రేంజ్ పరిధిలో 80 హెక్టార్లలోని రెండు జీడి తోటలలోని 138 చెట్లు, ఎలమంచిలి అటవీ రేంజ్ పరిధి పెద్దపల్లిలో 30 హెక్టార్లలో 1080 చెట్లు, రాజయ్యపేటలో ఆరు హెక్టార్లలో 196 చెట్లు వేలం పాట జరిగింది. కార్యక్రమంలో డీఎఫ్‌వో శ్యామ్యూల్, సబ్ డీఎఫ్‌వో సునీల్, నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు పాల్గొన్నారు.

కె.అగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం


అమ్మవారి సారెతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండల అగ్రహారం గ్రామంలో గౌరీపరమేశ్వరుల పండగను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం గౌరీపరమేశ్వరుల ప్రతిమలను గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఊరేగింపుతో పాటు మహిళలు, పురుషులు సారెతో గ్రామానికి అనుకొని ఉన్న చెరువులో గౌరీ పరమేశ్వర్ల ప్రతిమలను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొలిరెడ్డి అచ్చియ్యమ్మ, గ్రామ నాయకులు పి.రమణ, చిటికల రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో అర్జీలకు రసీదులు ఇవ్వండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనుల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చీమలపాడు ఆదివాసీలు

రావికమతం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై ఆదివాసీలు ఇచ్చిన అర్జీలకు రసీదులు ఇవ్వడంతో పాటు వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చీమలపాడు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ముందుగా సోమవారం రావికమతంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ సలహాదారు పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ డిసెంబరు చీమలపాడు పంచాయతీలో గ్రామ సభను నిర్వహించగా, ఆదివాసీల ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు వినతి పత్రాలను అందజేశారన్నారు. వాటిలో నాలుగు అర్జీలకు మాత్రమే అధికారులు ఆదివాసీలకు రసీదులు ఇచ్చారని, మిగిలిన వాటికి రసీదులు ఇవ్వకపోవడం వెనక అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కమిషనర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం గ్రామ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని ఆదివాసీలు ఇచ్చిన వినతులను స్వీకరించిన అక్కడికక్కడే రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన గ్రామసభల్లో ఆదివాసీలు ఇచ్చిన వినతిపత్రాలను తక్షణమే గ్రీవెన్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, వాటి రసీదులు అందజేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ బి.వెంకటరమణకు అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆదివాసీలు ఇచ్చిన వినతులకు రసీదులు తప్పనిసరిగా ఇస్తామని, ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ హక్కుల సంఘం కార్యదర్శి నల్లి కల్యాణం, కన్వీనర్ మోసూర్ రాజు, సభ్యుడు తుర్రే రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం


విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయినులతో పూర్వ విద్యార్థినులు

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాల తరువాత ఆ విద్యార్థినులంతా ఒక్క చోట చేరారు. స్థానిక కొత్తూరు జెడ్పీ హైస్కూల్ వేదికగా పూర్వ విద్యార్థినుల ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 1989-92 సంవత్సరం బ్యాచ్ విద్యార్థినులందరూ సోమవారం జెడ్పీ హైస్కూల్‌లోనే సమావేశమయ్యారు. 35 సంవత్సరాల తరువాత కలిసిన ఈ విద్యార్థినులంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు మంచి నడవడి, విద్యా బుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయినులు కమల. నవమాలిని, సుందరి, మంగాకుమారి, గాయత్రి, విజయలక్ష్మిలను కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషిచేసిన వారిలో రేవతి, కృష్ణవేణి, భవానీ, ధనలక్ష్మి, సువర్చల, సుజాతలతో పాటు సహకరించిన హెచ్‌ఎం రామిరెడ్డిని వారు అభినందించారు.

ఉత్తమ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం పంచాయతీకి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు లభించడంతో రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో అవార్డును సర్పంచ్ కామలక్ష్మి అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక నాయకులు, ప్రజలు సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు దంపతులను, పంచాయతీ కార్యదర్శి జగదీశ్ (ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి)ని పూలమాల వేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కామలక్ష్మి మాట్లాడుతూ స్థానిక నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా సహకారం అందించడంతో అవార్డు పొందగలిగామని చెప్పారు. కార్యదర్శి జగదీశ్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయించాలి

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కల్లుగీత కార్మికల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ ప్రకారం నర్సీపట్నంలో కల్లు గీత కార్మికులకు మద్యం షాపు కేటాయించలేదన్నారు. కల్లు గీత పని మూడు నెలలు మాత్రమే ఉంటుందని, మిగిలిన కాలమంతా ఖాళీగా ఉండి కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలపెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు తాతబాబు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

భూములను ఆన్‌లైన్ చేసుకోండి

-ఎల్.రామారావు, తహసీల్దార్



రెవెన్యూ సదస్సుల ద్వారా 726 మంది రైతుల నుంచి దరఖాస్తులు రాగా, 650 దరఖాస్తులను పరిష్కరించాం. కోర్టు తగాదాల్లో ఉన్నవి పెండింగులో ఉంచాం. రాచపల్లి రెవెన్యూ అన్‌రాక్ కంపెనీ (ఫైనీర్) భూ సేకరణ బ్లాకుల జాబితా తెప్పించుకున్నాం. తొందరలోనే ఏపీఐఐసీ రికార్డుల నుంచి ఆ భూములను తొలగిస్తాం. రైతులు తమ భూమిని తప్పనిసరిగా అన్‌లైన్ చేసుకోవాలని చెబుతున్నాం.

ప్రశ్న: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఎంతవరకు పరిష్కారించారు?

జవాబు: మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా 726 మంది రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. వాటిని గ్రామాల వారీగా వీఆర్వోలకు పంపించి 650 దరఖాస్తులను పరిష్కరించాం. కొన్ని కోర్టు తగాదాల్లో ఉండడంతో పెండింగులో ఉంచాం.

ప్ర: రాచపల్లి ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైన భూములకు మోక్షమెప్పుడు?

జ: రాచపల్లి రెవెన్యూ అన్‌రాక్ కంపెనీ (ఫైనీర్) భూసేకరణలో 2,450 ఎకరాల భూమి తీసుకున్నారు. ఆ భూమిలో పాటు రైతులకు చెందిన సుమారు 300 ఎకరాల భూమి ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదైంది. అక్కడ రైతులంతా ఏపీఐఐసీ రికార్డుల నుంచి తొలిగించాలని దరఖాస్తు చేశారు. ఇప్పటికే ఏపీఐఐసీ నుంచి భూ సేకరణ బ్లాకుల జాబితా తెప్పించుకున్నాం. తొందరలోనే ఏపీఐఐసీ రికార్డుల నుంచి ఆ భూములను తొలగిస్తాం.

ప్ర: మ్యూటేషన్లు ఎలా అవుతున్నాయి?

జ: రైతుల సాగులో ఉండి భూమి ఆన్‌లైన్ కాకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు. వెంటనే వీఆర్వోను ఆ భూమి మీదకు పంపించి పరిశీలన చేయించడంతో పాటు చుట్టపక్కల రైతుల నుంచి స్టేట్‌మెంటు తీసుకుని అన్‌లైన్ చేస్తున్నాం. ఆరు నెలల కాలంలో సుమారు 140 వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు అందజేశాం.

ప్ర: రీ సర్వే చేసే గ్రామాల్లో రైతులకు ఎటువంటి సూచనలు ఇస్తున్నారు?

జ: తప్పనిసరిగా భూమి అన్‌లైన్ చేసుకోవాలని చెబుతున్నాం. రీ సర్వేతో రైతులకు భూ సమస్యలు తొలిగిపోతాయి.

-మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

విద్యార్థి దశలోనే పోటీ తత్వం అలవర్చుకోవాలి

మాకవరపాలెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే పోటీ తత్వం అలవర్చుకోవాలని ఎంఈవో మూర్తి సూచించారు. మాకవరపాలెంలో గౌతిమి కళాక్షేత్ర కేంద్రంలో సోమవారం ఉగాది పురస్కార పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను బయటకు తీయడానికి పోటీలు వేదికగా దోహదపడతాయని చెప్పారు. ఉగాది వరకూ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని, విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గౌతిమి కళా క్షేత్ర కేంద్రం అధ్యక్షుడు రంగరాజు, కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వాసవీ క్లబ్ ఆర్థిక సాయం

నర్సీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వాసవీ కుటుంబ సంరక్ష పథకంలో భాగంగా ఇటీవల మరణించిన పచ్చిగోళ్ల సత్యనారాయణమూర్తి కుటుంబానికి రూ.3.79 లక్షలు ఆర్థిక సాయం చేశారు. క్లబ్ ఇంటర్నేషన్ గవర్నర్ కొల్లూరి పార్వతీ ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వి.నారాయణరావు, టి.అయ్యప్ప, నరసింగరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

11న తలుపులమ్మ పండగ

గొలుగొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెల 11వ తేదీన పలు గ్రామాల్లో తలుపులమ్మ పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుండుపాల, ఏటిగైరంపేట, పుత్తడిగైరంపేట గ్రామాల్లో పండగ జరుగుతుంది. దీంతో పుర వీధుల్లో విద్యుత్ దీపాలు అలంకరిస్తున్నారు. రాత్రికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కత్తితో మహిళ హల్‌చల్



నర్సీపట్నం: పట్టణంలోని శారదానగర్‌కు చెందిన ఓ మహిళ సోమవారం కత్తి పట్టుకొని హల్‌చల్ చేసింది. తలకు మంకీ క్యాప్ పెట్టుకొని, మాస్కు ధరించి కత్తి పట్టుకొని మార్నింగ్ వాకింగ్ చేస్తున్న మహిళను స్థానికులు గమనించి, కత్తి పట్టుకొని ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఆత్మరక్షణ కోసం కత్తితో తిరుగుతున్నానని, తాను సీబీఐ ఉద్యోగినని సమాధానం చెప్పింది. దీంతో పట్టణ సీఐ గోవిందరావుకు సమాచారం ఇచ్చారు. కొంతకాలంగా ఆమె మానసిక ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సీలేరులో విదేశీయుల సందడి



సీలేరుకు బస్సులో వచ్చిన జర్మనీ దేశస్థుల బృందం

సీలేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో సోమవారం విదేశీయులు సందడి చేశారు. జర్మనీ దేశానికి చెందిన 19 మంది విశాఖపట్నంకు చెందిన కేఆర్ సింగ్ ఆధ్వర్యంలో సీలేరు విచ్చేశారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కేందుగూడ గ్రామాన్ని సందర్శించి, గిరిజనుల ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నారు. సీలేరులో యూసీఐఎం హాస్టల్ విద్యార్థులతో కొద్దిసేపు సరదాగా గడిపారు.

శ్రీనివాసులనాయుడుని గెలిపించాలి

▸▸ పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గోపీనాథ్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గోపీనాథ్

చింతపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి గాదే శ్రీనివాసుల నాయుడుని ఉపాధ్యాయులు గెలిపించాలని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ డి. గోపీనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యా యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాదే శ్రీనివాసులనాయుడు కృషి ఫలితంగానే సీఆర్‌టీల రెగ్యులైజేషన్ చేశారన్నారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి గాదే శ్రీనివాసులనాయుడుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, రాష్ట్ర కార్యదర్శి కిట్లంగి ప్రసాద్, రాష్ట్ర కౌన్సెలర్ కొర్రు మత్స్యలింగం, మండలాధ్యక్షుడు సంజీవరావు, నాయకులు చిట్టిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల పనులకు అడ్డుకోవడం తగదు'

సీలేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నాయకులు అభివృద్ధిని ప్రోత్సహిస్తుంటే సీలేరులో కొంత మంది అభివృద్ధిని అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీలేరులో బస్ షెల్టర్ వద్ద మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఏపీ జెన్‌కో అధికార్లు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లగా.. మరుగుదొడ్లకు స్థలా న్ని కేటాయించారన్నారు. ఎంపీ నిధులు, గ్రామ పంచాయతీ నిధులు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు ప్రారంభించిన తరుణంలో కొంతమంది కూటమి నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మరుగు దొడ్ల పనులకు సహకరించాలని కోరారు. అధికారులు మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలన్నారు.

రిటైర్డు టీచర్‌కు ఘనంగా సన్మానం



తాడిపీధి టీచర్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలం తాడిపీధి ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు దూరు నారాయణను సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యాప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయుడు నారాయణ చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.చిట్టిబాబు, ఎస్.రామారావు, ఎస్.జానకమ్మ, టీడీపీ నాయకులు ఎస్.రమణ, ఎస్.మోహన్‌బాబు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఎస్. అర్జున్‌బాబు, వైస్‌ఛైర్మన్ ఎస్.కొండబాబు పాల్గొన్నారు.

భూబదలాయింపు చట్టం పటిష్టం చేయాలి

▸▸ సీపీఐ మండల కార్యదర్శి సత్తిబాబు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూబదలాయింపు చట్టాన్ని పటిష్టం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భూబదలాయింపు చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం అత్యంత బాధాకరమన్నారు. స్పీకర్ హోదాలో ఉండి బాధ్యతారాహిత్యంగా చట్టం సవరించాలని మాట్లాడడం దురదృష్టకరమన్నారు. అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. 1970 నుంచి షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూబదలాయింపు చట్టం అమలులో ఉన్నప్పటికీ పక్కాగా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి అన్ని చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయాలని విన్నవించారు.

మూగజీవుల సంరక్షణపై అవగహన



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న డాక్టర్ రాజశ్రీ

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలు, వన్యప్రాణులను సంరక్షించుకోవాలని పశు వైద్యధికారిణి రాజశ్రీ కోరారు.మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూగజీవాలు, వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన అవగహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యవసాయానికి తోడ్పాటునిచ్చే మూగజీవాల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు సంజీవరావు, త్రినాథరావు, రాజు పాల్గొన్నారు.

సూకూరుపుట్టులో ఘనంగా రథసప్తమి వేడుకలు ప్రారంభం

పాడేరురూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.గొందూరు పంచాయతీ సూకూరుపుట్టు సూర్యనారాయణ స్వామి ఆలయంలో వీహెచ్‌పీ కార్యదర్శి, గిరిజన అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఉదయం 5 గంటల నుంచి స్వామి వారి యజ్ఞ కార్యక్రమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు నారాయణ సేవ, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. నదీ స్నానాలు ఆచరించి సూర్యనమస్కారాలు చేపట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో సూకూరుపుట్టు నుంచి పాడేరుకు చేరుకున్న సూర్యనారాయణస్వామి మాలదారులు, గిరిజన అర్చకులు మోదకొండమ్మ ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకున్న సూర్యనారాయణమూర్తి



పాడేరులో శోభయాత్రను చేపట్టిన సూర్యనారాయణ స్వామి మాలదారులు, గిరిజన అర్చకులు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేంద్రరాజు



ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేంద్రరాజు

పాడేరురూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో తగిన గుర్తింపు పొందాలని కాకినాడకు చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్రరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కందమామిడి బాలికల ఆశ్రమ పాఠశాల్లో పదో తరగతి విద్యార్థినులకు ప్రముఖ యోగా గురువు పతాంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో బాలికలకు చదువు చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, దానిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల మాటలను జవదాటకుండా నడుచుకోవాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులే హీరోలన్నారు.

తల్లిదండ్రుల తరువాత స్థానంలో విద్యను నేర్పే గురువులు, దేశ రక్షణకు శ్రమించే సైనికులు హీరోలని వివరించారు. అనంతరం యోగా గురువు శ్రీనివాస్ విద్యార్థినులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మలిరెడ్డి ఫణీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవ్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం

జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



పాడేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి ఊతం ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిర్వహించిన అరకు చలి ఉత్సవ్‌పై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం తగదని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ హితవు పలికారు. ఈమేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యాటకుల్ని ఆకర్షించేలా జిల్లాలోనే ఎన్నో పర్యాటక ప్రదేశాలున్నాయని, వాటిని గత ఐదేళ్ల కనీసం పట్టించుకోకుండా నిర్వీర్యం చేసి, పర్యాటకాభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం ఎంతో వైభవంగా అరకు చలి ఉత్సవాలు నిర్వహించిందన్నారు. అరకు చలి ఉత్సవ్ నిర్వహణతో కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందనే అక్కసుతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం పద్ధతి కాదన్నారు. కేవలం పర్యాటకంగా జిల్లాలో ఎటువంటి అభివృద్ధి జరగకూడదనే ఆలోచనతో వైసీపీ నేతలు ఈవిధంగా వ్యవహరించడం సరికాదని, ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ హితవు పలికారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

పాడేరురూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పురస్కరించుకొని పాడేరులోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీఅక్షర హైస్కూల్లో ప్రిన్సిపాల్ ఐ.రాజేష్ పర్యవేక్షణలో సరస్వతీ దేవికి పూజలు చేసిన అనంతరం 150 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల్లో 124 మంది, మోదమాంబ హైస్కూల్లో, గౌతమి పాఠశాలలో చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాసాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, చీపురు రమాదేవి, సూర్యనారాయణ నాయుడు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతపల్లిలో సామూహిక అక్షరాభ్యాసాలకు హాజరైన బాలబాలికలు, తల్లిదండ్రులు



పాడేరు విజ్ఞాన భారతి పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

చింతపల్లిలో..

మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాలకు విశేష స్పందన లభించింది. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమంలో 203 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌరి శ్రీనివాసరావు, బీవీకే ఎస్టేట్ అధికారి రమణమూర్తి పాల్గొన్నారు.

సీలేరులో..

స్థానిక డీఏవీ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి పూజను నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సరస్వతీదేవికి విద్యార్థులచే కుంకుమ పూజను నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జోలాపుట్టు జలాశయంలో కొనసాగుతున్న గాలింపులు

మూడో రోజూ లభ్యంకాని బాలుర ఆచూకీ
నీట మునిగిన నాటుపడవ వెలికితీత
బాధిత కుటుంబాలకు ఒడిశా ఎమ్మెల్యే పరామర్శ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ముంచంగిపుట్టు సమీపాన గల జోలాపుట్టు జలాశయంలో బాలుర ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం పడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతైన విషయం తెలిసిందే. వారి ఆచూకీ మూడో రోజు కూడా లభ్యం కాలేదు. గత మూడు రోజులుగా జలాశయంలో ఒడిశాకు చెందిన ఓడీఆర్ఎఫ్ బృందాలు విస్తృత గాలింపులు చేపడుతున్నా ఫలితం కానరావడంలేదు. సోమవారం ఒడిశా ఎమ్మెల్యే రామచంద్రో గాలింపు చర్యలను పరిశీలించారు. ఓడీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడి తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యమయ్యే వరకు గాలింపులు కొనసాగించాలని వారికి ఆదేశించారు.

అలాగే పడవ ప్రమాద సంఘటనలో ఈతకొట్టుకుంటూ ఒడ్డుకు వచ్చిన బాలుడుతో ఎమ్మెల్యే మాట్లాడి, ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. గల్లంతైన వారి సమాచారం తెలిసే వరకు గాలింపులు జరిగే విధంగా ఏర్పాట్లు చేశామని, ఈ సమయంలో ధైర్యంగా ఉండాలని అన్నారు. అలాగే అన్ని విధాలుగా ఆదుకుండామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు.







ఒడ్డుకు చేరిన బాలుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే. గాలింపులు చేపడుతున్న సహాయక బృందాలు ప్రమాదానికి కారణమైన పడవను ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

పిల్లల ఆచూకీ కోసం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని, త్వరగా వారి సమాచారం తెలిసేలా అన్ని చర్యలు చేపడుతున్నామని వారికి చెప్పారు.

నాటుపడవ వెలికితీత

జోలాపుట్టు జలాశయంలో ప్రమాదానికి కారణమైన నాటుపడవను సోమవారం ఓడీఆర్ఎఫ్ బృందాలు గుర్తించాయి. ఆ పడవను అతికష్టంపై ఒడ్డుకు తీసుకువచ్చారు. జలాశయం పక్కన ఉన్న ఆ పడవపై కొంత దూరం వెళ్లి రీల్స్ తీసుకుంటున్న తరుణంలో ఆ పడవ నీట మునిగిపోయింది. అయితే రాత్రి 7 గంటల వరకు గాలింపులు చేపట్టినా ఇద్దరు బాలురు ఆచూకీ మాత్రం కానరాలేదు. వారి ఆచూకీ కోసం సహాయంక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పడవ మునిగిన ప్రదేశం ఎక్కులోతుతో పాటు బండరాళ్లు ఎక్కువగా ఉన్నాయని, ఆ ఇద్దరు పిల్లలు ఎక్కడైనా చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా నందపూర్ ఎస్‌డీపీవో సంబిత్ మజ్జి, లంతాపుట్టు, ముంచంగిపుట్టు తహసీల్దార్లు ప్రభతిజ్యోతి, నర్సమ్మలు గాలింపు చర్యలను పరిశీలించారు. సంఘటన జరిగిన ప్రదేశంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు రేయింబవళ్లు తేడా లేకుండా బాలుర ఆచూకీ కోసం గుండెల నిండా బాధతో ఎదురుచూస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీడీపీ మండల నాయకులు

అనంతగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా పంచాయతీ కేంద్రానికి చెందిన కిల్లో చిన్న గుండెపోటుతో ఆదివారం మృతి చెందగా, విషయం తెలుసుకున్న జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆ కుటుంబానికి పార్టీ శ్రేణుల ఆర్థిక అందించారు. టీడీపీ మండల నాయకులు సోమవారం బొర్రా వెళ్లి మృతుడు కుటుంబాన్ని పరామర్శించారు. జీసీసీ ఛైర్మన్ కిడారి అందించిన రూ.10 వేలను మృతుడు భార్య కలిమకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, బొర్రా సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ దొన్ను, నాయకులు బిడ్డ లక్ష్మణరావు, ప్రసన్నకుమార్, శ్యామ్. పి.జగన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి అనంతలోకాలకు..

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. యువకుడు మృతి

పామూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఊరు గాని ఊరుకు వచ్చి ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన అశోక్ (21) మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా పామూరు మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ టి.అశోక్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...

పామూరు పంచాయతి పరిధిలోని గోపాలపురం వద్ద ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు రంపచోడవరం మండలం బూసిగూడెంకు చెందిన విష్ణు, అశోక్‌లు ఆదివారం ఉదయం గోపాలపురం గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో సరుకుల కోసం ఇటుక బట్టీ యజమానికి చెందిన ద్విచక్ర వాహనంపై పామూరుకు వచ్చి పనులు ముగించుకొని తిరిగి గోపాలపురం గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి నెల్లూరు జిల్లా వరికుంటపాడు గ్రామానికి వెళుతున్న కారు గోపాలపురం జాతీయ రహదారి సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చొన్న అశోక్(21) ఎగిరి కారును తగిలి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న విష్ణుకు స్వల్ప గాయాలయ్యాయి. విష్ణును మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. మృతుడు, క్షతగాత్రుడు అవివాహితులు. విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్) పలు కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సీఈఎంఎస్ కమాండోర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపాల్‌కృష్ణ తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) సహకారంతో అందించే శిక్షణకు 27 సంవత్సరాలలోపు వయసు కలిగిన అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లొమా/ఇంజనీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్‌లో ఉత్తీర్ణులు అర్హులన్నారు. కొరియర్ సూపర్‌వైజర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్ ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సీ ఆపరేటర్, సీఎన్‌సీ ప్రొగ్రామర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీర్ కోర్సులలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తామన్నారు. అల్లూరి సీతారామారాజు జిల్లా నిరుద్యోగ యువత కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సింధియా జంక్షన్ సమీపంలోని సీఈఎంఎస్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 నంబర్లలో సంప్రదించి, ఈనెల పదో తేదీ లోగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

శ్యామ్ ప్రకాశ్ కుటుంబీకులకు సాయం

కొయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్ బారిన పడిన రాజేంద్రపాలెంకు చెందిన గోకిరి శ్యామ్ ప్రకాష్ కుటుంబీకులకు ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ప్రతినిధులు రూ. 8 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. శ్యామ్ ప్రకాష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసేందుకు యూనియన్ ప్రతినిధులు ఆదివారం రూ.8 వేలను పోగు చేశారు. అయితే శ్యామ్ ప్రకాష్ (16) ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. ఇది తెలుసుకున్న పాత్రికేయులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, గిరిజన సంఘం నేత నర్సు పాపారావు చేతుల మీదుగా చిన్నాన్న గోకిరి శ్రీను కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కనకరాజు, లవకుశ, పి. సత్యనారాయణ, కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ పాల్గొన్నారు.

జి.మాడుగులలో దట్టంగా మంచు

జి.మాడుగుల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని వాహనాలను నడుపుతున్నారు. ఉదయం పది గంటలు అయినా మంచు తెరలు వీడడం లేదు. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నారు. ముఖ్యంగా కాఫీ పండ్లు సేకరణ సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరురూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అటెండెంట్ అసోసియేషన్ క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. షేక్ జమీల్ బాషా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంవీఆర్.ప్రభాకర్, కార్యదర్శి కె.రామకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మార్చి 3 నుంచి సార్వత్రిక ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పాడేరురూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఈ ఏడాది ఇంటర్మీడియట్ (ఏపీవోఎస్ఎస్) పరీక్షలు మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నదని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను జిల్లాలో 8 కేంద్రాలను నిర్వహిస్తామన్నారు. అరకువేలిలో 1, పాడేరులో 1, చింతూరులో 1, చింతపల్లిలో 2, రంపచోడవరంలో 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3వ తేదీన ఇంగ్లీషు, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 15వ తేదీన జీవ శాస్త్రం, వాణిజ్య శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు ఉంటాయన్నారు. అన్ని పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 1,699 మంది హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

బస్కీ పాఠశాల ఉపాధ్యాయుడి మృతి

అరకులోయ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండలం బస్కీ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొర్రా ఏలియా మృతి చెందారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆయన మరణించారు. ఏలియా మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

సరియవలసలో తాగునీరు అందించాలి



గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బోరు వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సోమవారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ జేజేఎం ద్వారా ఏర్పాటు చేసిన బోరు నిరుపయోగంగా దర్శనమిస్తుందన్నారు. ఈ సమస్యపై పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. నిరుపయోగంగా ఉన్న బోరును మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి విశాఖ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తీసుకువెళ్లి శస్త్ర చికిత్సలు చేయిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు

ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి


కూండ్రంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

» డీపీవో శిరీషారాణి

కొత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామాల్లోనూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి సూచించారు. గ్రామంలో ఉన్న చెత్తను సేకరించి ఏ విధంగా ఎరువును తయారు చేస్తున్నారనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త నంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణను పరిశీలించారు. ప్రతి శనివారం గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్సీ నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ కేవీవీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పి.ఎస్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో అధికారుల పర్యటన

» గ్రామంలో కిడ్నీ వ్యాధులకు గల కారణాలపై అన్వేషణ


గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

తుమ్మపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెంలో సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యటించారు. గ్రామ పరిసరాల్లో ఇళ్ల, పొలాలు, చెట్లను పరిశీలించారు. గ్రామంపై దుమ్ము, ధూళి ప్రభావాన్ని పరిశీలించి, తాగునీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో బాలాజీ మాట్లాడుతూ గ్రామంలో కిడ్నీ వ్యాధుల సంక్రమణకు కారణాలను అన్వేషిస్తున్నామన్నారు. నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు మాట్లాడుతూ క్వారీ, క్రషర్ల నుంచి వెలువడే కాలుష్యాన్ని తనిఖీ చేస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు, మాకవరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాసవీమాత ఉత్సవాల ముగింపు


కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠా శత జయంతి ముగింపు ఉత్సవాలు ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల మొదటి రోజైన మంగళవారం కార్యక్రమాన్ని కుర్తాళం శ్రీసిద్ధేశ్వరి పీఠం సిద్ధేశ్వర ఆనంద భారతి మహాస్వామి, కుర్తాళం శ్రీసిద్ధేశ్వరి పీఠం ఉత్తరాధికారి దత్తతేశ్వరానంద భారతి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 4న అమ్మవారి శోభా యాత్రను నిర్వహిస్తారు. 5న సామూహిక లక్ష తులసీ నామార్చనలు, 6న రుద్రాభిషేకం, సుహాసినిల పూజ, 7న లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహిస్తారు. 8న మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కశింకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం సోమవారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో తాము ఎంచుకునే వృత్తిని ఎంపిక చేసుకొని ఆ దుస్తులతో వార్షికోత్సవానికి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 కె.సత్యనారాయణమూర్తి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జి.వి.కే.ఆచారి, ఎస్.తమ్మిరాజు, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, పి.వి.సత్యనారాయణమూర్తి, నబిత లక్ష్మి, నూకరాజు, సోమరాజు, సత్యవాణి, త్రివేణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో అక్రమ నిర్మాణాలు


వినాయకుని గుడి ఎదురుగా ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్న దృశ్యం

కొత్తూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వినాయకుని గుడి ఎదురుగా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం పూరిపాకల ముసుగులో చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు. తక్షణమే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతున్నారు.

60 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

కశింకోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెన్షనర్ల సంఘం, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం జరిగింది. ఈ శిబిరంలో 60 మంది రోగులకు డాక్టర్ రుచిత వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి కొలచిన కామేశ్వరరావు, ట్రెజరర్ కానూరి గోపాలరావు, సహాయ కార్యదర్శి నంబా రమణ, తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి జనసేన సాయం

పరవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పెదముషిడివాడ పంచాయతీ పరిధి పైడిమాంబ కాలనీకి చెందిన జనసేన నాయకుడు దాలిబోయిన దేముడు భరణికంలో గల అనాథ ఆశ్రమానికి రూ.30 వేల నగదును సోమవారం ఆశ్రమం నిర్వాహకులకు అందజేశారు. అలాగే ఆశ్రమంలోని విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కరణం నర్సింగరావు, బొండా లీలాకృష్ణ, శనివాడ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రథ సప్తమికి ఆదిత్యుని ఆలయం సిద్ధం

» నేడు ఘనంగా ఉత్సవాలు
» ఏటా అరసవల్లి తరహాలో వేడుకలు
» భారీగా పోలీస్ బందోబస్తు


సూర్య భగవానుడు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రథ సప్తమి ఉత్సవాలకు అనకాపల్లి మండలం రాజుపాలెంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం సిద్ధమైంది. ఎంతో విశిష్టత గల ఆలయంలో ప్రతి ఏటా అరసవల్లిలో జరిగే రథ సప్తమి వేడుకల తరహాలో ఇక్కడ కూడా ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారం జరిగే రథ సప్తమి వేడుకలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

రాజుపాలెంలో 42 సంవత్సరాల క్రితం కొండ దిగువన స్వయంభూగా ఈత చెట్టు మధ్య స్వామివారు వెలిశారు. 2010 సంవత్సరంలో ఆలయంలో స్వామివారిని చినజీయర్ స్వామి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో స్వామివారి దర్శనానికి వస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

గట్టి పోలీస్ బందోబస్తు

రథ సప్తమి వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఇతర జిల్లాల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు వేల సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ గుల్లిపల్లి రవికుమార్ పర్యవేక్షణలో అనకాపల్లి రూరల్, టౌన్, పరవాడ, మునగపాక, కశింకోట, సబ్బవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి పోలీస్ స్టేషన్ల నుంచి ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 20 మంది ఏఎస్ఐలు, 145 మంది కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు.

భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు

జబర్దస్త్- 2025 డైనమిక్ డ్యాన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ డైనమిక్, 20 మంది కళాకారులతో తప్పెటగుళ్ళ, తోడపెద్దుసేవ, బాణసంచా హంగామా, అనకాపల్లి పీలా పద్మ సారథ్యంలో 10 బృందాలు, 200 మంది కళాకారులతో కోలాటాలు, రాజమండ్రి కళాకారులతో నమో వెంకటేశాయ నృత్య ప్రదర్శన, అన్నమాచార్య చక్రవర్తి ఆధ్వర్యంలో భక్తిరస సంకీర్తన కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా సూర్యనారాయణస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి రాజుపాలెంలో సూర్యనారాయణమూర్తి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

» కొత్తూరు ఎర్ర చెరువు పక్కన ఉన్న స్థలాలను పరిశీలించిన కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్


కొత్తూరులో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

కొత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కొత్తూరు ఎర్ర చెరువు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మాణమైన చెరువులో పూర్తి సౌకర్యాలు కల్పించేందుకు చర్చించారు. ఉద్యానవనం పనులను ప్రారంభించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వే శాఖ సహాయ సంచాలకులు గోపాలరాజు, వీఎంఆర్‌డీఏ ముఖ్య ప్రణాళికాధికారి శిల్పా, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, ఎంఏవో వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్ రాంబాబు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్, సహాయక ఇంజనీర్ నాయుడు పాల్గొన్నారు.

'ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి'


ఏఎస్ఐ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏపీ టిడ్కో గృహ సముదాయం వద్ద ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని, తక్షణమే వారి ఆగడాలను అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు సోమవారం గృహ సముదాయంలో నివాసం ఉంటున్న మహిళలతో కలిసి పరవాడ ఏఎస్ఐ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు డి.లక్ష్మి, ఐ.సూరమ్మ, కె.లక్ష్మి, ఎన్.లావణ్య, వి.మంగ, టి. అన్నపూర్ణ, రాణి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం


తాళ్లపాలెం జాతీయ రహదారి వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయలేదని ఆరోపిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల ప్రతినిధులు తాళ్లపాలెం జాతీయ రహదారి వద్ద బడ్జెట్ ప్రతులను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్, బడా పారిశ్రామికవేత్తలకు, సంపన్నులకు అనుకూలంగా ఉందని, సామాన్యులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. బడ్జెట్‌లో మన రాష్ట్రానికి సంబంధించి రాజధాని అమరావతి గురించి గానీ, కడప ఉక్కు గురించి గానీ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనుల కేటాయింపునకు సంబంధించి ఊసే లేకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు వి.బెన్నయ్య, బలరాం, నూకరాజు, గోవింద, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు


అధ్వానంగా ఉన్న పెదముషిడివాడ- ఇ.మర్రిపాలెం రహదారి

లంకెలపాలెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం పెదముషిడివాడ నుంచి ఇ- మర్రిపాలెం వెళ్లే మట్టిరోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ రహదారిని నిర్మించారు. అప్పట్లో కొంత మేర బీటీ రోడ్డు నిర్మించి విడిచి పెట్టారు. మిగతాది మట్టి రోడ్డు కావడంతో రహదారి పొడవునా పెద్ద గోతులు ఏర్పడ్డాయి. పెదముషిడివాడ, శివారు గ్రామాల ప్రజలకు ఇ- మర్రిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. క్వారీ లారీల రాకపోకలతో రహదారి మొత్తం ఛిద్రంగా మారింది. గోతులకు తోడు లైట్లు లేకపోవడంతో చీకటి పడితే ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. దీనిని బీటీ రోడ్డుగా నిర్మించాలని ఎన్నిసార్లు అధికారులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ఈ రహదారిని బీటీ రోడ్డుగా నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు అక్కులమ్మ పేరంటాలు తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలం లోని రావలమ్మపాలెం గ్రామంలో మంగళవారం అక్కులమ్మ పేరంటాలు తీర్థాన్ని ఘనంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు జక్కాన సూర్యనారాయణ, శ్రీరామమూర్తి, వెంకటరావు, సత్యనారాయణ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం బాల నాగమ్మ బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన జడ్సీ


ఎస్ఆర్ శంకరన్ భవన ఆవరణలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో జడ్సీ బీవీ రమణ సోమవారం పలు చోట్ల విస్తృతంగా పర్యటించారు. రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్ పరిశీలించారు. అక్కడ పారిశుధ్య పనులను సిబ్బందితో చేయించారు. అలాగే గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిర ఆవరణను పరిశీలించారు. విలీన గ్రామమైన శంకరం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్సీ రమణ మాట్లాడుతూ సమయానికి హాజరై పనులు నిర్వహించడంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్మికులకు సూచించారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్, తదితరులు ఉన్నారు.

'విద్యార్థి నాయకుల అరెస్టు దారుణం'

తుమ్మపాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి సభలో నిరసన తెలియజేసిన విద్యార్థి సంఘం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ ఆరోపించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా చంద్రబాబునాయుడు విద్యార్థులకు అండగా ఉంటానని హామీని ఇచ్చి ఇప్పుడు విద్యార్థులకు వ్యతిరేకంగా పాలన సాగించడం దారుణమన్నారు. తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫణీంద్ర, జగదీశ్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి రిజిస్టర్ పోస్టులో అంగన్‌వాడీల వినతులు


వినతిపత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ, రెగ్యులైజేషన్ అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రాలను రిజిస్టర్ పోస్టులో పంపారు. అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల మూడు, నాలుగవ తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వర్కర్లు, హెల్పర్లు రాష్ట్రపతికి వినతిపత్రాన్ని రిజిస్టర్ పోస్టులో పంపాలని నిర్ణయించామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగశేషు చెప్పారు. దొడ్డి రామునాయుడు భవనంలో దీనికి సంబంధించి వినతిపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, రామలక్ష్మి, పావని, తనూజ, తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో వసంత పంచమి వేడుకలు


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సబ్బవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురంలో రాజరాజేశ్వరీ సహస్ర అమ్మవారి పీఠంలో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాగ్దేవి హోమం నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ముందుగా గోమాత పూజ, అభిషేకం, శోడషోపచార పూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమ, ప్రభాకర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. కాగా ఈ వేడుకల్లో సినీ నటుడు అవసరాల శ్రీనివాస్, హరిద్వార్ అనంత్ దామ్ నుంచి వచ్చిన అనంత బాబా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఫార్మా ఎక్స్‌పోతో ప్రజలకు మరింత చేరువ

» వ్యాపారాభివృద్ధికి దోహదం
» పలు సంస్థల ప్రతినిధులు వెల్లడి



వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో ముఖద్వారం

పరవాడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో (ఎగ్జిబిషన్)- 2025లో పాల్గొనడం వల్ల ప్రజలు, పరిశ్రమల యాజమాన్యాలకు మరింత చేరువయ్యామని పలు సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పబ్లిసిటీతో పాటు వ్యాపారాభివృద్ధికి కూడా ఈ ఎగ్జిబిషన్ తోడ్పడుతుందన్నారు. దేశ నలుమూలలు నుంచి సుమారు 150 సంస్థలకు చెందిన యజమానులు, ఉద్యోగులు ఇక్కడికి తరలివచ్చారు. వివిధ సంస్థల నుంచి వచ్చిన పలువురు ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తమ మనోగతం తెలియజేశారు.

పరిశ్రమలకు చెందిన మోటార్లు తయారు చేస్తున్నాం



ఫార్మా, ఫార్మాయేతర పరిశ్రమలకు చెందిన మోటార్ల తయారీని మా సంస్థ చేపడుతోంది. ఫ్యాన్లు, లైట్లు, స్విచ్‌ల తయారీతో పాటు 2018 నుంచి మోటార్లు కూడా తయారు చేస్తున్నాం. ఇటువంటి ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు మా కంపెనీ గురించి చెప్పే అవకాశం దక్కడం ఆనందంగా ఉంది. నెల్లూరు శ్రీసిటీలో మాసంస్థకు చెందిన పరిశ్రమ ఉంది.

- కె.అరుణకుమార్, డిప్యూటీ మేనేజర్, హెవిల్స్ ఇండియా లిమిటెడ్

ఫార్మా ఎక్స్‌పోతో చాలా ఉపయోగం



వైజాగ్ ఫార్మా ఎక్స్‌పోలో పాల్గొనడం చాలా ఉపయోగమని చెప్పాలి. మా సంస్థ ద్వారా ఫార్మా పరిశ్రమలకు వినియోగించే వాక్యూమ్ పంపు యంత్రాలను తయారు చేస్తున్న విషయాన్ని ఎగ్జిబిషన్ ద్వారా సందర్శకులకు తెలియపరుస్తున్నాం. మాకు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖ, విజయవాడలో సంస్థలు ఉన్నాయి. నిపుణుల పర్యవేక్షణలో యంత్రాల తయారీ కొనసాగుతోంది.

- కె.వినోద్, మేనేజింగ్ డైరెక్టర్ బసాయి ఇండస్ట్రీస్, చెన్నై

వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు



వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఫార్మా పరిశ్రమలకు సంబంధించిన అన్ని రకాల పైపులను మా సంస్థలో తయారు చేస్తున్నాం. రసాయనాల కారణంగా పైప్‌లు పాడవకుండా తయారు చేయడం మా ప్రత్యేకత. మా దగ్గర కొన్న వాటికి 25 సంవత్సరాల గ్యారంటీ ఇస్తున్నాం.

- వివేక్ గుప్తా, మేనేజింగ్ పార్టనర్, ఆస్ట్రల్ ఇండస్ట్రియల్ పైపింగ్ సిస్టమ్, విశాఖ

రహదారి భద్రతపై అవగాహన అవసరం

» ట్రాఫిక్ నియమాలు పాటించాలి
» సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన

సబ్బవరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ పి.సింహాచలం సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ చేసి కళాశాల ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, నెహ్రూ యువజన కేంద్రం ప్రతినిధి కె.లీలాప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ లెక్కల గణేశ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కబళిస్తున్న కేన్సర్



కేన్సర్‌కు అడ్వాన్స్‌డ్ వైద్య సేవలందించే లీనియర్ యాక్సిలిరేటర్ మెషిన్‌తో రేడియేషన్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పాండురంగకుమారి

ఉత్తరాంధ్ర పరిధిలో ఏటా 20వేల కొత్త కేసులు

- కేజీహెచ్‌లోనే ఎనిమిది వేలకుపైగా గుర్తింపు
- అవగాహనతోనే వ్యాధిని ఎదుర్కొనే అవకాశం
- నగరంలో పదికిపైగా ఆస్పత్రుల్లో వైద్య సేవలు
- నేడు ప్రపంచ కేన్సర్ డే

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

కేన్సర్ మహమ్మారి ఎన్నో కుటుంబాలను కబళిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ప్రతి ఏటా సుమారు 20 వేల కొత్త కేసులు నమోదుకావడం పరిస్థితికి అద్దంపడుతోంది. వీరిలో 60 నుంచి 70 శాతం మంది వ్యాధి మూడు, నాలుగు స్టేజిలకు చేరాక ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నగరంలో కేజీహెచ్ సహా మరో పదికిపైగా ఆస్పత్రుల్లో కేన్సర్ బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నారు. వ్యాధి పట్ల అవగాహన లేక, సకాలంలో గుర్తించడం లేదు. దీనిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన ప్రపంచ కేన్సర్ డేగా పరిగణిస్తున్నారు. ఈ ఏడాది యునైటెడ్ బై యునిక్ థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు.

ఉత్తరాంధ్రలో ఎక్కువగా పురుషుల్లో నోటి, లంగ్, జీర్ణాశయం, పెద్ద పేగు, ప్రొస్టేట్ కేన్సర్లు కనిపిస్తున్నాయి. మహిళల్లో రొమ్ము, గర్భ సంచి ముఖద్వార, నోటి, అండాశయ, స్టమక్ కేన్సర్లు కనిపిస్తున్నాయి. చిన్నారుల్లో బ్రెయిన్, బ్లడ్ కేన్సర్లు వెలుగుచూస్తున్నాయి. గతంతో పోలిస్తే రొమ్ము కేన్సర్లు అధికమవుతున్నాయి. ప్రతి వంద కేసుల్లో 30 రొమ్ము కేన్సర్లు ఉండగా, 25 నుంచి 30 వరకు గ్యాస్ట్రో ఇంటస్టైనల్ (పెద్ద పేగు, స్టమక్, లివర్, ప్రాంకియాస్) కేసులు ఉంటున్నాయి. ఆ తరువాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార, బ్లడ్ కేన్సర్లు, నోటి కేన్సర్లు ఉన్నాయి. చిన్నారుల్లో వచ్చే బ్లడ్, బ్రెయిన్ కేన్సర్లు పది వరకు నమోదవుతున్నాయి. గతంలో కేన్సర్ బారినపడిన వారిలో 50 నుంచి 60 ఏళ్ల దాటిన వారు ఉండగా, ప్రస్తుతం అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి 80 ఏళ్ల వృద్ధుడి వరకు కనిపిస్తోందని నిపుణులు చెబుతున్నారు.



కేజీహెచ్ కేన్సర్ విభాగంలోని ఐసీయూ వార్డు

కోలుకుంటున్న వారి సంఖ్యా ఎక్కువే..

కేన్సర్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుండడంతో కోలుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఏటా 25 వేల నుంచి 30 వేల మంది వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అధునాతన వైద్య పద్ధతుల సాయంతో నాలుగో స్టేజ్‌లో వ్యాధిని గుర్తించిన వారికి కూడా మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా జీవితకాలాన్ని పెంచగ లుగుతున్నారు. కేన్సర్ బారిన పడుతున్న వారిలో 51 శాతం మంది మహిళలు, 49 మంది పురుషులు ఉంటున్నారు. రోబోటిక్ సర్జరీ, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియో థెరపీ, అడాప్టివ్ రేడియో థెరపీ, ఇమ్యునో థెరపీ వంటి పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నారు.

అవగాహనతోనే దూరం

జీవన విధానంలో మార్పులు, కలుషిత ఆహారం తీసుకోవడం, పొగాకు ఉత్పత్తులు, మద్యం తదితరాలు కేన్సర్ కారకాలు. కేన్సర్ పట్ల అవగాహన ఉండి, 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగా వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందుకోవచ్చు. కొన్ని రకాల వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇవీ గణాంకాలు..

గత ఏడాది కేజీహెచ్‌లోని మెడికల్ అంకాలజీలో 4,959 మంది కేన్సర్ రోగులను పరీక్షించి, 3,384 మందిని ఇన్‌పేషెంట్‌లుగా చేరి వైద్యం అందించారు. వీరిలో 5,072 కీమో థెరపీలను ఇచ్చారు. సర్జికల్ అంకాలజీలో 148 మంది ఓపీలో సేవలుందించగా, 165 మందిని ఇన్‌పేషెంట్‌లుగా చేర్చుకుని చికిత్స చేశారు. 149 మందికి మేజర్, 103 మందికి మైనర్ సర్జరీలు నిర్వహించారు. రేడియేషన్ అంకాలజీ విభాగంలో నిర్వహించిన ఓపీలో 3,067 మందికి వైద్య సేవలు అందించారు. 1,192 మందిని ఇన్‌పేషెంట్‌లుగా చేర్చుకున్నారు. 922 మందికి మేజర్ రేడియేషన్, మరో 528 మందికి మైనర్ రేడియేషన్ చేశారు.

పెరుగుతున్న కేన్సర్ కేసులు



గత ఐదు, పదేళ్లతో పోలిస్తే కేన్సర్ కేసులు మూడు నుంచి ఐదు రెట్లు పెరిగాయి. వ్యాధి పట్ల అవగాహన లేకపోవడంతో మూడు, నాలుగు స్టేజుల్లో వస్తున్నారు. దీనివల్ల మెరుగైన వైద్య సేవలందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం కీమో థెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీతో రోగులు కోలుకునేలా చేస్తున్నాం. మెడికల్ అంకాలజీ ఓపీలో ప్రతినెలా కొత్తగా 40 కేసులు గుర్తిస్తున్నాం. కేన్సర్లకు ఇదీ కారణమని చెప్పలేం. జీవన విధానంలో మార్పులు, కలుషిత ఆహారం తీసుకోవడం కూడా కారణాలే. అరకు, పాడేరు, చింతపల్లి నుంచి కొన్నిరకాల ట్యూమర్స్‌తో కూడిన కేన్సర్ కేసులు చూస్తున్నాం. 120 రకాల కీమోథెరపీ, మందులు ఇస్తున్నాం. వేగంగా వ్యాధిని గుర్తించడం ద్వారా మంచి ఫలితాలను రాబట్టగలం.

- డాక్టర్ కె.శిల్ప, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్

పూర్తిగా కోలుకున్నా



మాది మాడుగుల. ఆరు నెలల కిందట ఆయాసం, లేవడానికి శక్తి లేని పరిస్థితి. కేజీహెచ్‌లో చూపిస్తే లింపోమా కేన్సర్ అని చెప్పారు. మొదట్లో భయమేసింది. వైద్యులు ధైర్యం చెప్పారు. కోలుకుంటున్నావని భరోసా కల్పించారు. వైద్యులు చెప్పినట్టుగానే ఆరు నెలలు వైద్యం తరువాత పూర్తిగా కోలుకున్నా. ఇప్పుడు ఫాలోఅప్ ట్రీట్‌మెంట్‌కు వస్తున్నాం. కేన్సర్ తగ్గిపోయిందని వైద్యులు చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చెకప్‌కు వస్తున్నాను. ఆరోగ్యం బాగుంది.

- పి.అశ్విని, వ్యాధిని జయించిన మహిళ

సీపీఎం రాష్ట్ర కమిటీలో లోకనాథం, కోటేశ్వరరావులకు చోటు



కె. లోకనాథం



జి.కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో మూడు రోజులపాటు జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన కె. లోకనాథం, జి.కోటేశ్వరరావులకు రాష్ట్ర కమిటీలో స్థానం లభించింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జి.కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు.

జిల్లాలో 98 శాతం పింఛన్ల పంపిణీ

అనకాపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రానికి 98 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తయింది. జిల్లాలో 2,57,457 మంది లబ్ధిదారులకు గాను 2,52,499 మందికి (98 శాతం) పింఛన్ల నగదు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు.

ట్యాంకర్ బోల్తా పడి ఒకరి మృతి



బోల్తా పడిన ట్యాంకర్

కొయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బట్టపణుకుల- కాట్రగెడ్డ మధ్య సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ కిశోర్‌వర్మ తెలిపిన వివరాల మేరకు.. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మట్టి రోడ్డును నీళ్లతో తడుపుతున్న ట్యాంకర్ సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అదుపు తప్పి బట్టపణుకుల- కాట్రగెడ్డ గ్రామాల మధ్య బోల్తా పడింది. ఈ ఘటనలో మండలంలోని ఎం.మాకవరానికి చెందిన లారీ డ్రైవర్ దళవరి నాగరాజు (35) మృతి చెందాడు. కేసు దరాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బంగారం కోసమే వృద్ధురాలి హత్య

- సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్టు
- జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా



కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందితో ఎస్పీ తుహిన్‌సిన్హా

చోడవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బంగారం కోసమే వృద్ధురాలిని హత్య చేసినట్టు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ లక్కవరం గ్రామంలో గత నెల 9న పొలంలో గడ్డి కోసేందుకు వెళ్లిన ఓ.నరసమ్మను కత్తితో దారుణంగా పొడిచి, ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారం తాడును నిందితుడు ఎత్తుకుపోయారని, ఘటన జరిగిన వెంటనే ఈ కేసును ఛేదించేందుకు అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. నిందితుడి కోసం పోలీసు సిబ్బంది 25 రోజులకుపైగా వివిధ ప్రాంతాల్లో తీవ్రంగా గాలింపులు నిర్వహించిన అనంతరం సోమవారం మండలంలోని గజపతినగరం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్టు చెప్పారు. అతని నుంచి వృద్ధురాలి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నా మన్నారు. నిందితుడు ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన వృద్ధురాలి బంగారం వసూలు చేసి కోర్టు ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు అందచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు

లక్కవరంలో హత్య జరిగిన అనంతరం సాంకేతిక ఆధారాలతోనే నిందితుడి గుర్తించామని ఎస్పీ తెలిపారు. వృద్ధురాలి హత్య జరిగే సమయంలో ఆ ప్రాంతంలో కదలికల ఆధారంగా నిందితుడు అక్కడే ఉన్నట్టు సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా నిర్ధారణ అయిందన్నారు. దీంతో నిందితుడు అతడే అన్న నిర్ధారణకు వచ్చామని, అతని గురించి ఆరా తీస్తున్న సమయంలో గతంలో విజయనగరం జిల్లా కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో ఇదే తరహా హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్టు బయటపడిందని తెలిపారు. దీంతో జిల్లా జైలు అధికారుల నుంచి నిందితుడి వివరాలు సేకరించడంతో పాటు, పాత నేరస్తుల నుంచి నిందితుడికి అత్యంత సన్నిహితుల నుంచి వివరాలు సేకరించి అతని కోసం గాలింపు నిర్వహించారన్నారు. వృద్ధురాలిని హత్య చేసి ఆమె మెడలో బంగారంతో పరారైన నిందితుడు విజయనగరం జిల్లా కొత్తవలస ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.1.85 లక్షలకు తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాలలో తిరిగినట్టు తేలిందన్నారు నిందితుడి బ్యాంకు లావాదేవీలు, ఏటీఎం నుంచి విత్‌డ్రాలు పరిశీలించి, అతను ఎక్కడెక్కడ తిరుగుతున్నదీ పోలీసు బృందాలు గుర్తించి ఆయా రాష్ట్రాలలో తిరిగారన్నారు. ఎట్టకేలకు గజపతినగరం జంక్షన్ వద్ద ఉన్నట్టు సమాచారం తెలుసుకుని సీఐ అప్పలరాజు, ఎస్‌ఐలు నాగకార్తీక్, జోగారావు నిందితుడ్ని అరెస్టు చేశారన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు ఎస్పీ వివరించారు.

పోలీసు సిబ్బందికి రివార్డులు

మహిళ హత్య కేసు ఛేదించిన చోడవరం పోలీసులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించడంతో పాటు రివార్డులు, మెరిట్ సర్టిఫికెట్లను అందచేశారు. కేసులో నిందితుడిని పట్టుకునేందుకు శ్రమించిన అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐ అప్పలరాజు, ఎస్‌ఐలు నాగకార్తీక్, జోగారావు, హెచ్ కానిస్టేబుల్ బంగార్రాజు, కానిస్టేబుళ్లు నానాజీ, నాగదేవి, హోంగార్డులు పి.బాలాజీ, బి.బాలాజీ, వీవీఎస్ ప్రసాద్, టి.శ్రీనులకు ఎస్పీ రివార్డులు అందించి అభినందించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

... 5వ పేజీ తరువాయి

పార్టీలు, నాయకల ఫ్లెక్సీలు యథావిధిగా దర్శనమిస్తు న్నాయి. నేతల విగ్రహాలకు ముసుగులు వేయలేదు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన సిబ్బందికి ఇవేమీ పట్టడంలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో సంబంధిత అధికారులు గ్రామాల్లో రాజకీయ పరమైన ఫ్లెక్సీలను తొలగించాలి. అదే విధంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసు గులు వేయాలి. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదు. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేసినప్పటికీ పలు గ్రామాల్లో ఫ్లెక్సీలు తీయలేదు. పెనుగొల్లు, వమ్మవరం, జంగులూరు, వెలంపాలెం గ్రామాల్లో సోమవారం సాయంత్రం వరకు వైసీపీ, టీడీపీ నేతల ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. గోకులపాడులో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేయలేదు.

గల్లంతైన వైద్య విద్యార్థి మృతదేహం లభ్యం



షణ్ముఖ నాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి వీవీ.నాయుడు

ముత్తుకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరుపాలెం సముద్ర తీరం వద్ద ఆదివారం గల్లంతైన వైద్య విద్యార్థి షణ్ముఖనాయుడు మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. సరదాగా సముద్ర తీరానికి వచ్చిన వైద్య విద్యార్థుల్లో అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం మునగపాక గ్రామానికి చెందిన షణ్ముఖనాయుడు సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం ఈతగాళ్ల సాయంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం కనిపించలేదు. సోమవారం ఉదయం 10గంటల ప్రాంతంలో నేలటూరు పాలెం సమీపంలోని జెన్‌కో థర్మల్ కేంద్రం పంప్‌హౌస్ బ్రేకింగ్ వాటర్ వద్దకు షణ్ముఖ మృతదేహం కొట్టుకొచ్చింది. పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఆ విద్యార్థి తండ్రి వీవీ.నాయుడు, కుటుంబ సభ్యుల రోదనలతో తీరంలో విషాదం నెలకొంది. కృష్ణపట్నం ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి షణ్ముఖ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ

... 5వ పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో నాటి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ, ఏడాదిలోగా అభివృద్ధి పనులు పూర్తవుతాయని చెప్పారు. కానీ ఏడాదిన్నర అయినప్పటికీ పూర్తికాలేదు. అనకాపల్లి ప్రస్తుత ఎంపీ సీఎం రమేశ్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇటీవల పరిశీలించారు. పనులన్నీ ఆరు నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను, రైల్వే అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే ఈ ఏడాది చివరినాటికి పూర్తవుతాయని భావిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

... 5వ పేజీ తరువాయి

పోలింగ్ నిర్వహిస్తారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. తొలిరోజైన సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అయితే పది మంది నామినేషన్ పత్రాలను కలెక్టరేట్ నుంచి తీసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ సమర్పిస్తారని ఏపీటీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. ఆరో తేదీన పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, ఏడో తేదీన పీఆర్‌టీయూ మద్దతుతో గాదె శ్రీనివాసులనాయుడు నామినేషన్లు దాఖలు చేస్తారు.

క్రైం... crime news

కొత్తరోడ్డులో యువకుడి అనుమానాస్పద మృతి

- వివరాలు సేకరించిన క్లూస్ టీం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్
- ఎవరో కొట్టి, ఉరేసి చంపేశారని మృతుడి తల్లి ఆరోపణ



సంఘటన స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ విష్ణుస్వరూప్



మృతుడు పూర్ణశేఖర్ (ఫైల్ ఫొటో)

సబ్బవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం దరి కొత్తరోడ్డు వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనికి సంబంధించి మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదనాయుడుపాలెం దరి కొత్తరోడ్డుకు చెందిన నారపాడు గోవింద, నాయుడమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు లోకేశ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడు పూర్ణశేఖర్(22) డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం కోటపాడు మండలం కోడూరు గ్రామంలో స్నేహితుడి పెళ్లికి స్థానిక స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ స్నేహితుల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడ నుంచి తిరిగి ఇంటికి వచ్చేశాడు. రాత్రి పది గంటలకు భోజనం చేశాడు. తన సెల్ ఫోన్, తల్లి సెల్ ఫోన్ పట్టుకుని బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారుజామున కల్లం వద్దకు వెళ్లిన తల్లిదండ్రులకు పశువుల షెడ్డుకు వేలాడుతూ విగత జీవిగా పూర్ణశేఖర్ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ పి.సింహాచలం సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. క్లూస్ బృందం సభ్యులు వచ్చి వేలి ముద్రలు, ఇతర వివరాలు సేకరించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లి నాయుడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడి ముఖంపై గాయాలు ఉండడంతో తన కుమారుడిని ఎవరో గాయపరిచి, బలవంతంగా ఉరేసి చంపేశారని తల్లి ఆరోపిస్తున్నది.

కారు ఢీకొని ఒకరి మృతి



షేక్ బాజ్జీ మృతదేహం

కొత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం పిసినికాడ గ్రామ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన షేక్ బాజ్జీ(30) నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి వలస వచ్చాడు. అప్పటి నుంచి రోజూ ఉదయం ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి పాత సామగ్రి కొనుగోలుదారునికి విక్రయిస్తున్నాడు. రాత్రి వేళ గ్రామ సమీపంలో ఉన్న ఒక దాబాలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో అతను దాబా నుంచి రోడ్డు దాటుతుండగా కశింకోట నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతనిని అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, అతని సంబంధీకులు అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ ఫోన్ నంబరు 9440796085ను సంప్రతించాలని హెడ్ కానిస్టేబుల్ కోరారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య




ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి (ఫైల్)

చింతపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందజేసిన వివరాలిలా ఉన్నాయి.

గూడెంకొత్తవీధి మండలం లక్కవరపుపేట గ్రామ పంచాయతీకి చెందిన సుర్ల విశ్వతేజ్ (17) చింతపల్లి గిరిజన సంక్షేమ శాఖ గురుకుల జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థి పునఃప్రారంభం నుంచి నేటి వరకు కళాశాలకు హాజరుకాలేదు. వారం రోజులుగా స్వగృహం, కళాశాలకు వెళ్లకుండా స్నేహితులు, బంధువుల వద్ద ఉంటున్నాడు. ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గరపడుతుండడంతో ఆందోళనకు గురైన విద్యార్థి ఓ లేఖను రాసి చింతపల్లి వైటీసీ భవనం వెనుక కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'అమ్మా..నాన్న క్షమించండి.. చెల్లిని జాగ్రత్తగా చూసుకోండి.. నా మరణానికి ఎవరు కారణం కాదు.. కళాశాలకు హాజరుకాకపోవడం వల్ల పరీక్షలు రాసినా పాస్ కాలేను.. నా ముఖాన్ని మీకు చూపించలేకపోతున్నాను' అని లేఖలో రాసి తన జేబులో పెట్టుకున్నాడు. స్థానికులు ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా అందొచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంపై తండ్రి లక్ష్మణరావు, తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

టి.జగ్గంపేటలో వృద్ధుడి ఆత్మహత్య



అప్పలనాయుడు మృతదేహం

కోటవురట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.జగ్గంపేట గ్రామంలో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రమేష్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. టి.జగ్గంపేట గ్రామానికి చెందిన కోరుప్రోలు అప్పలనాయుడు(67) తరచూ మద్యం సేవిస్తున్నాడు. దీంతో ఆరోగ్యం పాడు చేసుకోవద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అప్పలనాయుడును వైద్యం నిమిత్తం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కుమారుడు కోరుప్రోలు రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నక్కపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లివానిపాలెం హైవే జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన యలమంచిలి నూకాలమ్మ (50) మృతి చెందినట్టు సీఐ కె.కుమారస్వామి చెప్పారు. నూకాలమ్మ సాయంత్రం రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494